స్కాన్ చేయండి...
పేపర్ చదవండి...

www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
RNI No: TELTEL/2024/86684

గురువారం | 08.05.2025 | సంపుటి : 2 | సంచిక :97 | పేజీలు : 8 | వెల : 2/-

**విలేకరులు కావలెను**
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 91824 74575

## ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొందాం

### అత్యవసర సేవల ఉద్యోగుల సెలవులు రద్దు

- ప్రభుత్వ ఉద్యోగులు అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు
- 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబర్
- ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- నేడు సంఘీభావ ర్యాలీ.. హాజరు కానున్న సీఎం, మంత్రులు




'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో సైన్యంతో మనమంతా వెన్నంటి ఉన్నామనే సందేశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి సమయంలో రాజకీయాలకు తావు లేదన్నారు. అత్యవసర సేవలు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, మంత్రులు, అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు.

హైదరాబాద్, మే 7 : మంత్రులు, అధికారులు విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉద్యోగులు, మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబర్ సిద్ధం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నారు. నగరంలోని సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ఇది కొనసాగనుంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర నేతలు పాల్గొననున్నారు.

మిగతా 2 లో



03

## భారత సైనిక పాటవానికి సెల్యూట్
ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుదముట్టించాల్సిందే : కేసీఆర్



03

## చిరుతల్లాంటి మహిళా ఆఫీసర్లు
వ్యోమికా సింగ్.. సోఫియా ఖురేషి



## లంకాదహనంలాగా సైన్యం దాడులు

- మన సైనికులు రాత్రి ఒక చరిత్ర సృష్టించారు
- ఆపరేషన్ సిందూర్‌పై కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

03

ఆపరేషన్ సిందూర్‌ను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ లంకాదహనంతో పోల్చారు. హనుమాన్ లంకా దహనం చేసినట్లే.. మన సైన్యం ఉగ్రవాదులపై దాడి చేసిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాక్‌లోని ఉగ్రదాడుల శిబిరాలపై భారత్ బుధవారం వేకువ జామున దాడి చేసిన విషయం తెలిసిందే.

## పాక్ రేంజర్ల కాల్పుల్లో పదిమంది పౌరుల మృతి
ఆర్మీ సెలవులను రద్దు చేసిన రక్షణశాఖ

03

## భారత్ ఆపరేషన్ సిందూర్

- పాక్ గడ్డపై బాంబుల వర్షం
- ఉగ్రస్థావరాలు లక్ష్యంగా దాడులు
- కనీసం వందకు పైగానే ఉగ్రవాదుల హతం
- వివరాలు వెల్లడించిన ఆర్మీ అధికారులు

04




భారత ఉద్ద విమానాలు మరోమారు గర్జించాయి. పాక్ భూభాగంలోని ఉగ్రమూకలు లక్ష్యంగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. ఆక్రమిత కాశ్మీర్ సహా పాక్‌లోని మొత్తం 9 ఉగ్రస్థావరాలను వైమానికదళం ధ్వంసం చేసింది.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో మోడీ భేటీ

- ఆపరేషన్ సిందూర్‌పై వివరించిన ప్రధాని
- నేడు అఖిలపక్ష సమావేశానికి ప్రభుత్వం పిలుపు

04





03

## దేశంలో భయానక పరిస్థితులు లేవు

- ప్రజలు అప్రమత్తంగా ఉంటే చాలు
- నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్

## కృష్ణా నీటి అక్రమవాడకాలకు చెక్

- పలుచోట్ల టెలీమెట్రీ ఏర్పాటు చేయాలి
- పోలవరం బ్యాక్ వాటర్ ముప్పు తప్పించాలి
- కేంద్ర జలసంఘాన్ని కోరిన మంత్రి ఉత్తమ్



**న్యూఢిల్లీ, మే 7 :** కృష్ణా నది నుంచి ఎపి అక్రమంగా నీటిని తరలించకుండా నియంత్రణ అవసరమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు నదిపై వివిధ ప్రదేశాల్లో టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. అలాగే, పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ముంపు ప్రమాదం ఉందని పేర్కొంటూ రిటెన్షన్ వాల్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర జల సంఘం ఛైర్మన్ అతుల్ జైన్ తో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో బుధవారం భేటీ అయ్యారు. వివిధ ప్రాజెక్టులతో పాటు అనేక అంశాలను చర్చించారు. మేడిగడ్డ,

మిగతా 2 లో



## కర్రెగుట్టల్లో ఎదురు కాల్పులు..
26 మంది మావోయిస్టులు మృతి

03

## పాక్ రేంజర్ల కాల్పుల్లో పదిమంది పౌరుల మృతి
ఆర్మీ సెలవులను రద్దు చేసిన రక్షణశాఖ

03



02

## మన సూచీలు కూల్.. పాక్ స్టాక్ మార్కెట్ కుదేల్



## ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం
మాజీ మంత్రి హరీశ్‌రావు

02

## హైదరాబాద్‌లో విజయవంతంగా మాక్ డ్రిల్

### సైరన్ మోగడంతో పలుచోట్ల ప్రజల అప్రమత్తం

పాకిస్తాన్ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ సాయంత్రం 4 గంటలకు మొదలైంది. మొదట నగరంలో పలుచోట్ల సైరన్లు మోగాయి. హైదరాబాద్ నగరంలో పలుచోట్ల సైరన్లు మోగాయి. ప్రధాన కూడళ్లు, అపార్ట్‌మె ంట్ల వద్ద సైరన్లు మోగించారు.



03



07

## టెస్టులకు రోహిత్ వీడ్కోలు
వన్డేల్లో కొనసాగుతానని ప్రకటన

www.rajamudranews.com

రాజముద్ర

తెలుగు దిన పత్రిక




# కృష్ణా నీటి అక్రమవాడకాలకు చెక్

(మొదటిపేజీ తరువాయి)

సమ్మక్క సారక్క, పాలమూరు-రంగా రెడ్డి ప్రాజెక్టులపై వీరిద్దరి మధ్య చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడం పై జాతీయ డామ్ సంరక్షణ సంస్థ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణ పై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. అనంతరం సమావేశ వివరాలను ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఛైర్మన్ అతుల్ జైతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేడిగడ్డ, సమ్మక్క సారక్క, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రధాన ప్రాజెక్టులపై చర్చ జరిగింది. రాష్ట్ర నీటిపారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇక మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడంపై జాతీయ డ్యామ్ సంరక్షణ సంస్థ ఇప్పటికే నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో మేడిగడ్డ డిజైన్, ఆపరేషన్‌లో లోపాలున్నాయని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్.. ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా, ప్రాజెక్ట్ పునరుద్ధరణకు సరైన మార్గాలను అన్వేషిస్తున్నాం అని పేర్కొన్నారు. డీపీఆర్‌లో చూపిన స్థలం ఒకటి కాగా, అసలు నిర్మాణం వేరే ప్రాంతంలో జరిగిందని ఆయన విమర్శించారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల విషయంలో కేంద్ర జల సంఘంతో సంప్రదింపులు కొనసాగించాల్సిన అవసరం ఉందని ఎన్డీఎస్సీ సూచించిందని చెప్పారు.అలాగే నూతన నిర్మాణాలు, కేటాయింపులపై ఆయన చర్చించారు. ఇందులో భాగంగా మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించాలా లేదా అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని మంత్రి తెలిపారు. అలాగే తుమ్మిడి హట్టి వద్ద కొత్త ప్రాజెక్టును నిర్మించనున్నట్లు- వెల్లడించారు. ఇంకా సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు 44 టీ-ఎంసిల నీటిని త్వరితగతిన కేటాయించాలని కోరారు. వీటితోపాటు- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మొత్తం 90 టీ-ఎంసిలు అవసరమని, తక్షణమే 45 టీఎంసులను ముందుగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.



# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

### - మాజీ మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట :** ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట గ్రామీణ మండలం ఇర్కోడు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. "ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేసే దిక్కు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలకు ధాన్యం మొలకెత్తినా కొనుగోలు చేయడం లేదు. తరుగు పేరిట క్వింటాలుకు 5 కిలోల కోత విధిస్తున్నారు. కేసీఆర్ పాలనలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చాం. ఈ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటోంది. పాలన చేతగాకపోతే సీఎం రేవంత్‌రెడ్డి దిగిపోవాలి. అప్పు పుట్టడం లేదని ముఖ్యమంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. హైదరాబాద్‌లో కూర్చొని రోజూ అందాల పోటీలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. 43 సార్లు ఢిల్లీకి విమానంలో వెళ్లి వచ్చి రేవంత్‌రెడ్డి ఏం సాధించారు" అని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్, ఆర్డీవో, సివిల్ సప్లైస్ అధికారులతో ఫోన్లో మాట్లాడి త్వరితగతిన ధాన్యం కొనుగోళు పూర్తి చేయాలని ఆదేశించారు. సైనికులు వీరోచితంగా పోరాడాలి: ఎల్లమ్మతల్లి దయతో సైనికులు వీరోచితంగా పోరాడి విజయం సాధించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆకాక్షించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని మాచాపూ-ర్‌లో ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మరణించిన ఉగ్రవాదులకు సైన్యం సెల్యూట్

### అంతిమయాత్రలో పాల్గొన్న సైనికాధికారులు

**లాహోర్, మే 7 :** చనిపోయిన ఉగ్రవాదుల కోసం పాకిస్థాన్ కన్నీరు కారుస్తోంది. వారి అంత్యక్రియలకు హాజరై భారతదేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దృశ్యాలు బయటికొచ్చాయి. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకుంటామని పాకిస్థాన్ నిరంతరం అబద్ధాలు చెబుతూనే ఉంటుంది. మేమూ ఉగ్రవాదం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని మొసలి కన్నీరు కారుస్తూనే ఉండే పాక్ దుర్బుద్ధిని చాటుకుంది. పాక్ సైన్యానికి, ఉగ్రవాదులకు ఉన్న అనుబంధాన్ని ప్రపంచానికి తేటతెల్లం చేసింది. భారత వైమానిక దాడిలో మరణించిన లష్కరే తోయిబా ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ అంత్యక్రియలకు పాకిస్థాన్ ఆర్మీ అధికారులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఉగ్రవాదులపై చర్య పేరుతో దాయాది దేశం ప్రపంచాన్ని ఎలా మోసం చేస్తుందో ఈ ఉదంతమే గుర్తు చేసింది.. భారత దాడిలో మృతి చెందిన ఉగ్రవాదుల కోసం పాకిస్థాన్ సైన్యం రోదిస్తోంది. లష్కరే తోయిబా ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ అంత్యక్రియల ఊరేగింపులో పాకిస్థాన్ సైన్యం, పోలీసులు, ఐఎస్ఐ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఉగ్రవాదికి కన్నీటి వీడ్కోలు పలికారు. పాకిస్తాన్ ఆర్మీ అధికారులు శవపేటికల ముందు తలలు వంచి నిలబడి ఉన్న కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొందాం

(మొదటిపేజీ తరువాయి)

ఇండియన్ ఆర్మీ పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డీజీపీ జితేందర్,హోం సెక్రటరీ రవి గుప్తా, ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల రక్షణకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు,ఇతర నేతలు పాల్గొననున్నారు. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపైన కఠినంగా



వ్యవహరించాలని అన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్తనిల్వలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అత్యవసర మెడిసిన్ సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రైవేటు- ఆస్పత్రుల్లో బెడ్‌ల అందుబాటుపైన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కు పాదం మోపాలని హెచ్చరించారు. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు- సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు- భద్రతను పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రతను పెంచాలని ఆదేశించారు. ఐటీ- సంస్థల దగ్గర భద్రతను పెంచాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సూచించారు. రౌడీషీటర్లపైన, పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# సమస్యలను అర్థం చేసుకున్నాం



- అధికారుల కమిటీ ఛైర్మన్ నవీన్ మిత్తల్
- ఉద్యోగుల ఐకాస నేతలతో కమిటీ భేటీ
- 57 డిమాండ్లపై చర్చ

**హైదరాబాద్:** ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ బుధవారం సాయంత్రం సచివాలయంలో తెలంగాణ ఉద్యోగుల ఐకాస నేతలతో సమావేశమైంది. కమిటీ సభ్యులు లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్ హాజరయ్యారు. సాయంత్రం 4.45 గంటలకు మొదలైన సమావేశం 6.45 గంటల వరకు సాగింది. ఉద్యోగుల డిమాండ్లు 57 ఉండగా... ఒక్కో దాని గురించి ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు చదివి వినిపించారు. ఉపాధ్యాయుల సమస్యలను ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉద్యోగుల డిమాండ్లను సంఘాల్లోని ఆయా శాఖల నేతలు కమిటీకి వివరించారు. ముఖ్యంగా 2003 డీఎస్సీలో నియమితులైన ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం అనుమతించినా పాత పింఛన్ విధానం అమలు చేయకపోవడం, సీపీఎస్ రద్దు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని కొందరు డిమాండ్ చేశారు. కమిటీ ఛైర్మన్ నవీన్ మిత్తల్ స్పందిస్తూ.. డిమాండ్లను అర్థం చేసుకున్నామని, మరోసారి కమిటీ సమావేశమై అన్ని సమస్యలపై చర్చిస్తుందని చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్లి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఐకాస నేతలు దామోదర్‌రెడ్డి, చావ రవి, వంగా రవీందర్‌రెడ్డి, సదానందంగౌడ్, దేవరకొండ సైదులు, ముజీబ్ హుస్సేన్, ఎ.సత్యనారాయణ, బి.శ్యామ్, కస్తూరి వెంకట్, మధుసూదన్‌రెడ్డి, స్థితప్రజ్ఞ, కటకం రమేశ్, రామకృష్ణగౌడ్, ఎంబీ కృష్ణయాదవ్ తదితరులున్నారు.

**ఉద్యోగుల ప్రధాన డిమాండ్లివీ..**

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలి.

జీఓ 317ని సమీక్షించి... బాధితుల బదిలీల కోసం సూపర్ న్యూమరరీ పోస్టులను కల్పించాలి. స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను వీలైనంత త్వరగా వారి స్థానిక జిల్లా/జోన్‌కు కేటాయించాలి.

ఉపాధ్యాయులకు ఏకీకృత నిబంధనలు అమలు చేయాలి.

ప్రభుత్వం, ఉద్యోగులు, పింఛనుదారుల సహకారంతో ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్) అమలు చేయాలి.

2023 జనవరి 1 నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏలను వెంటనే విడుదల చేయాలి. బకాయిలను నగదు రూపంలో చెల్లించాలి.

సమగ్ర శిక్షా వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల కొలువులను క్రమబద్ధీకరించాలి. వారికి టైమ్ స్కేల్ ఇవ్వాలి.

ఆయా విభాగాల కార్యాలయాల నుంచి సచివాలయానికి బదిలీపై నియామకాల కోసం 12.5 శాతం కోటా అమలు చేయాలి.

రాష్ట్ర జాయింట్ స్టాఫ్ కౌన్సిల్/ఆఫీసర్స్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఉద్యోగులు, పింఛనుదారుల మనో వేదనలను పరిష్కరించడానికి ప్రధాన ఉద్యోగ సంఘాలకు గుర్తింపు ఇవ్వాలి. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల కోసం రాష్ట్రస్థాయిలో కమిటీని నియమించాలి.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

అన్ని జిల్లాలకు డీఈఓలు, డీఐఈఓ పోస్టులు, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు డిప్యూటీ ఈఓ పోస్టులు, అన్ని మండలాలకు ఎంఈఓ పోస్టులు మంజూరు చేయాలి.

మోడల్ స్కూళ్లు, గురుకులాలు, వైద్య విధాన పరిషత్, గ్రంథాలయ సంస్థ, మార్కెటింగ్ కమిటీ, ఎయిడెడ్ సంస్థల ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతభత్యాలు చెల్లించాలి

చాలా మంది ఉద్యోగులు పదోన్నతి లేకుండా పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో సెప్టెంబరులో అన్ని విభాగాల్లో డీపీసీలను నిర్వహించాలి.

# నకిలీ కరెన్సీ ముఠా అరెస్ట్

**కరీంనగర్, మే 7 :** నకిలీ కరెన్సీతో ప్రజలను దోచుకుంటు-న్న ముఠాను తాజాగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదుగురు ముఠా సభ్యులను వెల్గటూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నల్ల రంగు పేపర్ ని రసాయనంలో పెట్టి అచ్చు ఒరిజినల్ నోట్లగా మార్చేసి ప్రజలకు అంటగడుతున్నారు. నిందితులు ఊర్లలోకి వెళ్లి.. అమాయకుల దగ్గరి నుంచి అసలు నోట్లు- తీసుకుని నకిలీ నోట్లు ఇస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలోనే అసలు నోట్లు- రూ.7 లక్షల విలువ చేసే నోట్లు తీసుకుని.. నకిలీ 32 లక్షల రూపాయల నోట్లు- ఇస్తూ మోసం చేస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు. కోటిలింగాల వద్ద నోట్లు మార్చుకోనుచుండగా పోలీసులు వీరిని అరెస్ట్ చేశారు. వీరి దగ్గరి నుంచి ఒక కారు, బైక్, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.2,04000 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. 6 నలుపు రంగు నోట్లు-, ఐదు వందల నోటు-ను ముద్రించే బొమ్మ కరెన్సీని కూడా సీజ్ చేశారు. ఐదుగురిని అరెస్ట్ చేసి కోర్ట్ కు పంపించారు.

# శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురు

### మరోమారు విచారణకు ఆదేశాలు

**న్యూఢిల్లీ, మే 7 :** ఓఎంసీ కేసులో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం పూర్తిగా పక్కన పెట్టింది. 3 నెలల్లో మరోసారి విచారణ జరపాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా మరోసారి విచారణ చేపట్టాలని స్పష్టం చేసింది. 2022లో హైకోర్టు శ్రీలక్ష్మిని ఈ కేసు నుంచి డిశ్చార్జ్ చేసిన విషయం తెలిసిందే. ఆ డిశ్చార్జ్ పిటిషన్‌పై హైకోర్టు నిర్ణయాన్ని తాజాగా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నిందితులకు మంగళవారం హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు శిక్ష విధించిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితులైన గాలి జనార్దనరెడ్డితో పాటు- బి.వి.శ్రీనివాసరెడ్డి, వి.డి.రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్‌లకు ఒక్కొక్కరికి కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల చొప్పున జరిమానా విధించింది. ప్రభుత్వ ఉద్యోగి అయిన రాజగోపాల్‌కు అదనంగా 4 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. నిందితులు జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. ఓబుళాపురం మైనింగ్ కార్పొరేషన్‌కు రూ.2 లక్షల జరిమానా విధించారు. వేర్వేరు సెక్షన్ల కింద వేర్వేరుగా ఏడేళ్లు శిక్షలు పడినప్పటికీ ఏకకాలంలో అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ఇప్పటికే జైలులో అనుభవించిన శిక్షను మినహాయింపునిచ్చారు.

# ఉద్రిక్తతల మధ్య కర్తార్‌పూర్ కారిడార్ మూసివేత

**చండీగఢ్, మే 7 :** పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌జిల్లాలో దేరాబాబా నానక్ వద్ద ఉన్న కర్తార్‌పూర్ కారిడార్‌ను బుధవారం మూసివేసినట్లు- సీనియర్ అధికారి తెలిపారు. పంజాబ్‌లో గురుదాస్‌పూర్ జిల్లాలోని దేరాబాబా నానక్ మందిరాన్ని, పాకిస్తాన్‌లోని దర్బార్ సాహిబ్ గురుద్వారాలను కర్తార్‌పూర్ కారిడార్ కలుపుతుంది. ఈ కారిడార్‌ను నిలిపివేశామని, దర్బార్ సాహిబ్ గురుద్వారాను సందర్శించేందుకు యాత్రికులను అనుమతించరని అన్నారు. పాకిస్తాన్‌లోని గురుద్వారాలో ప్రార్థనలు చేసేందుకు బుధవారం ఉదయం పలవురు యాత్రికులు కర్తార్‌పూర్ కారిడార్ చేరుకున్నారు. యాత్రికులందరినీ తిరిగి రావాల్సిందిగా ఆదేశించినట్లు- వెల్లడించారు. గురునానక్ దేవ్ 550వ జయంతి సందర్భంగా 2019, నవంబర్ 9న కర్తార్‌పూర్ కారిడార్‌ను ప్రారంభించారు. గురునానక్ అంతిమ విశ్రాంతి స్థలమైన గురుద్వారాకు అన్ని మతాలకు చెందిన భారతీయ యాత్రికులు ఏడాది పొడవునా వీసా లేకుండా ప్రయాణించేందుకు అనుమతి ఉంది. భారత్ మరియు పాకిస్తాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. రోజుకు 5,000 మంది యాత్రికులు గురుద్వారాను సందర్శించవచ్చు.

# నా కుటుంబంలో 10మంది చనిపోయారు

- మరో నలుగురు సన్నిహితులు కూడా..
- జైషే మహ్మద్ ఉగ్రనేత మసూద్ అజార్ ప్రకటన



**లాహోర్:** భారత్ క్షిపణి దాడిలో తన కుటుంబానికి చెందిన 10 మంది మృతి చెందారని ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ అధినేత మౌలానా మసూద్ అజార్ బుధవారం ధ్రువీకరించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ వైమానిక దాడులు నిర్వహించింది. ఇందులో భాగంగా బహావల్‌పుర్‌లో గల జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయాన్ని క్షిపణి దాడితో ధ్వంసం చేసింది. ఈ క్రమంలో మసూద్ సోదరి-ఆమె భర్త, మేనల్లుడు-అతడి భార్య, మేనకోడలు, ఐదుగురు చిన్నారులు మరణించారని ఓ ప్రకటనలో మసూద్ వెల్లడించారు. అలాగే మసూద్‌కు అత్యంత సన్నిహితుడు, అతని తల్లి, మరో ఇద్దరు సన్నిహితులూ క్షిపణి దాడిలో మృతి చెందారని ఆ ప్రకటనలో వివరించారు.

**కరుడుగట్టిన ఉగ్రనేత:** మసూద్ అజార్‌ను 2019, మేలో 'అంతర్జాతీయ ఉగ్రవాది'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఏప్రిల్ 2019 నుంచి అజార్ బయట ప్రపంచానికి కనిపించకుండా బహావల్‌పుర్‌లోని ఓ రహస్య స్థావరంలో దాక్కున్నాడని భావిస్తున్నారు. భారత పార్లమెంటుపై ఉగ్రదాడి (2001), జమ్మూకశ్మీర్ శాసనసభపై దాడి (2000), పఠాన్‌కోట్‌లో ఐఏఎఫ్ స్థావరంపై దాడి (2016), పుల్వామాలో ఆత్మాహుతి దాడి (2019) వంటి ఘటనల్లో జైషే మహ్మద్ ముఖ్యపాత్ర పోషించింది. 1999లో ఐసీ-814 విమానాన్ని హైజాక్ చేసిన ఘటనలో ప్రయాణికులను సురక్షితంగా విడిచిపెట్టేందుకు ఉగ్రవాది మసూద్ అజార్‌ను భారత్ జైలు నుంచి విడుదల చేసింది. అప్పటి నుంచి బహావల్‌పుర్ జైషే మహ్మద్ ఉగ్రసంస్థకు ప్రధాన కేంద్రంగా మారిపోయింది. బహావల్‌పుర్‌లోని మర్కజ్ సుబాన్‌ను మసూద్ తన ఇంటిగా కూడా వినియోగిస్తాడు. ప్రస్తుతం జైషే నంబర్-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబసభ్యులు కూడా దీనిలోనే ఉంటున్నట్లు సమాచారం. దాదాపు 600 మంది ఉగ్రవాదుల ఇళ్లు కూడా ఈ క్యాంపస్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది.

## మన సూచీలు కూల్..

# పాక్ స్టాక్ మార్కెట్ కుదేల్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఓ వైపు పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరిట నిర్వహించిన దాడులు మన మార్కెట్లపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. భారత్ కేవలం ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకోవడంతో పాటు ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితుల్లో పాక్ ఈ సమస్యను మరింత జఠిలం చేయకపోవచ్చన్న అంచనాలు ఇందుకు తోడయ్యాయి. విదేశీ మదుపర్ల కొనుగోళ్లు, డాలర్ బలహీనడడం అమెరికా, చైనాలో వృద్ధి నెమ్మదించడం, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం వంటివి మన మార్కెట్లకు పాజిటివ్ అంశాలుగా మారాయి. ఈ కారణంగానే భారత్- పాక్ ఉద్రిక్తతలు పెద్దగా ప్రభావం చూపలేదు. ఆరంభంలో ఓ నష్టాలు చవిచూసినప్పటికీ.. తర్వాత స్వల్ప శ్రేణిలో కదలాడిన చివరికి లాభాల్లో ముగిశాయి. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ దాడులకు పాల్పడిందన్న వార్తల నేపథ్యంలో సెన్సెక్స్ ఉదయం 79,948.80 పాయింట్ల (క్రితం ముగింపు 80,641.07) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 80,844.63 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. 105.71 పాయింట్ల నష్టంతో 80,746.78 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 34 పాయింట్ల లాభంతో 24,414.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 41 పైసలు క్షీణించి 84.81గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ షేర్లు లాభపడ్డాయి. ఏషియన్ పెయింట్స్, సన్‌ఫార్మా, ఐటీసీ, రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు ధర



3,383 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**పాక్ స్టాక్ మార్కెట్ కుదేల్**

మరోవైపు మన భద్రతా బలగాలు చేపట్టిన దాడుల కారణంగా పాక్ స్టాక్ మార్కెట్ కుదేలైంది. పాకిస్థాన్ స్టాక్ మార్కెట్ ఇండెక్స్ కరాచీ- 100 ఆరంభంలో దాదాపు 6 శాతం నష్టంతో 6,272 పాయింట్లు పతనమైంది. తర్వాత కోలుకుంది. మన మార్కెట్లు ముగిసే సమయానికి 3470 పాయింట్ల నష్టంతో (3.09 శాతం) 110,063 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం భారత్ నుంచి ఎప్పుడైనా ప్రతిఘటన ఎదురుకావొచ్చన్న అంచనాలతో ఇప్పటికే ఆ సూచీ దాదాపు 3.7 శాతం మేర నష్టపోయింది. తాజా దాడితో మరో మాస్టర్ స్ట్రోక్ తగిలింది.

# లంకాదహనంలాగా సైన్యం దాడులు

- మన సైనికులు రాత్రి ఒక చరిత్ర సృష్టించారు
- ఆపరేషన్ సిందూర్‌పై కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, మే 7 :** ఆపరేషన్ సిందూర్‌ను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ లంకాదహనంతో పోల్చారు. హనుమాన్ లంకా దహనం చేసినట్లే.. మన సైన్యం ఉగ్రవాదులపై దాడి చేసిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాక్‌లోని ఉగ్రదాడుల శిబిరాలపై భారత్ బుధవారం వేకువ జామున దాడి చేసిన విషయం తెలిసిందే. ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 50 బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రారంభోత్సవం సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సైనికులు రాత్రి అద్భుత పరాక్రమం ప్రదర్శించారన్నారు. మన సైనికులు రాత్రి ఒక చరిత్ర సృష్టించారన్నారు. సాధారణ పౌరులకు ఎలాంటి సిబ్బంది లేకుండా దాడులు చేశారన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్తిసన్‌కు గట్టి సమాధానం ఇచ్చామన్నారు. ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసి సత్తాచాటారన్నారు. పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సాహసోపేతమైన దాడి చేశారని.. సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు చేశామన్నారు. ధైర్య సాహసాలు ప్రదర్శిం చిన సైనికులకు అభినందనలు తెలిపారు. సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తంగా ఉన్నామని.. సైనికులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి రాజ్‌నాథ్ సింగ్ ధన్యవాదాలు చెప్పారు. పహల్గాంలో అమాయకులను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారని ఆరోపిం చారు. పహల్గాంలో అమాయక పౌరులను చంపిన వారినే మట్టు-బెట్టినట్లు- పేర్కొన్నారు. శత్రువుకు సరైన బుద్ధి చెబుతామన్నారు. దేశభద్రకు భంగం కలిగించే చర్యలను సహించమన్నారు. ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా దాడులు చేశామన్నారు. లంకా దహనం చేసిన హనుమంతుడే మాకు ఆదర్శమని.. హనుమాన్ లంకా దహనం చేసినట్లే మన సైన్యం ఉగ్రవాదులపై దాడి చేసిందని రాజ్‌నాథ్ పేర్కొ న్నారు. భారత్ లక్ష్యం పాకిస్తాన్ కాదని.. ఉగ్రవాదులేనన్నారు.



## భారత సైనిక పాటవానికి సెల్యూట్

### ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తుదముట్టించాల్సిందే : కేసీఆర్

**హైదరాబాద్, మే 7 :** భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడుగా తాను గర్వపడుతున్నాని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏరూపంలో ఉన్నా.. ఏ దేశంలో వు న్నా.. ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేదికాదు. ఉగ్రవాదం అంతం కావాల్సిందే అని కేసీఆ ర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై, ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయి. భారత సైన్యం ఎంత విరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా వుండి దేశరక్షణలో మేమెవరికి తీసిపోము అన్నట్టు-గా వారికి శక్తి సామర్థ్యాలుండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.



## దేశంలో భయానక పరిస్థితులు లేవు

- ప్రజలు అప్రమత్తంగా ఉంటే చాలు
- నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్

**హైదరాబాద్, మే 7 :** దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ప్రజలు భయపడవద్దని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ సూచించారు. ప్రజలు ఫేక్ వార్తలను నమ్మి భయపడవద్దని అన్నారు. పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఈ మాక్‌డ్రిల్‌ను సీవీ ఆనంద్ పర్యవేక్షించారు. మాక్ డ్రిల్ అనంతరం సీపీ సీవీ ఆనంద్ మీడియాతో మాట్లాడారు. కేంద్రం ఆదేశాల మేరకు ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్‌డ్రిల్ నిర్వహించామని సీవీ ఆనంద్ తెలిపారు. రెండు నిమిషాల పాటు- సైరన్ మోగించి అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. నాలుగు ప్రాంతాల్లో వైమానిక దాడులు జరిగినట్లుగా మాక్‌డ్రిల్ చేశామని చెప్పారు. దాడులు జరిగితే తీసుకునే చర్యలు చేసి చూపించామని అన్నారు. క్షతగ్రాతులను తరలించే విధానంపై మాక్‌డ్రిల్ నిర్వహించామని తెలిపారు. అగ్నిమాపక, వైద్య సిబ్బంది చేపట్టే చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించామని అన్నారు. ప్రస్తుత పరిస్థితులపై ప్రజలు భయపడవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఈ మాక్‌డ్రిల్ చేపట్టామని తెలిపారు. జరిగిన లోపాలను సమీక్షించుకుని మరింత మెరుగ్గా చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఫేక్ వార్తలను నమ్మి భయపడొద్దని సూచించారు.

## ఆపరేషన్ సింధూరం విజయోత్సవాలు

### సంబరాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం

**హుస్నాబాద్, మే 7 :** పాకిస్తాన్ పై భారత్ చేసిన 'ఆపరేషన్ సింధూరం' విజయం కావడంతో దేశమంతటా విజయోత్సవ సంబరాలు కొనసాగుతున్నాయి. హుస్నాబాద్ నియోజకవర్గం కొహెడలో మంత్రి పొన్నం ప్రభాకర్ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేసారు. భారత్ మాత కి జై అంటూ నినాదాలు చేస్తూ సంబరాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానిస్తూ.. జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ టూరిస్టుల పై ఉగ్రవాదుల దాడి కి నిరసనగా ఆపరేషన్ సింధూర్ భారత ప్రభుత్వం చేపట్టిందని, భారత ప్రభుత్వం ఉగ్రవాద స్థావరాల పై చేసిన దాడి ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పై గట్టి చప్పట్లతో అభినందనలు తెలుపు తున్నట్లు ఆయన అన్నారు. రాజకీయాలకు అతీతంగా.. పార్టీలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు- ఆయన అన్నారు.కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంతో పాటు- అన్ని పార్టీల నాయకులు ఈ చర్యను సమర్థిస్తున్నాయని, హుస్నాబాద్ లో ప్రజలు కూడా సంబరాలు చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలందరూ ఉగ్రవాదుల చర్యలకు బుద్ధి చెప్పే విధంగా సైనిక చర్యలు ఉండాలని ప్రజలు కోరుకుంటు-న్నారని, దేశ సమగ్రతకు పాటు-పడుతున్న సైనిక చర్యలకు మద్దతు ఇస్తున్నట్లు- ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సైనికులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు మంత్రి పొన్నం.

## పాక్ రేంజర్ల కాల్పుల్లో పదిమంది పౌరుల మృతి

### ఆర్మీ సెలవులను రద్దు చేసిన రక్షణశాఖ

**న్యూఢిల్లీ, మే 7 :** పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిపై భారత బలగాలు దీటుగా స్పందించాయి. 'ఆపరేషన్ సిందూర్' పేరిట తొమ్మిది ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడ్డారు. ఈ దాడి తర్వాత కూడా పాక్ రేంజర్లు విచక్షణారహితంగా కాల్పులు జరుపుతున్నారు. బుధవారం కూడా పాక్ రేంజర్లు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 15 మంది భారత పౌరులు మృతి చెందగా.. 43 మంది గాయపడినట్లు భారత ఆర్మీ వెల్లడించింది. పూంఛ్, తంగ్ధర్ సెక్టార్లలో గత రాత్రి నుంచి పాక్ బలగాల కాల్పులు కొనసాగుతున్నాయని పేర్కొంది. సాధారణ నివాస ప్రాంతాలే లక్ష్యంగా పాక్ బలగాల కాల్పులకు పాల్పడుతోంది. ఈ తరుణంలో కేంద్ర హోంశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సెలవులో ఉన్న సిబ్బందిని వెనక్కి రప్పించాలని పారా మిలిటరీ బలగాలకు అమిత్ షా ఆదేశాలు జారీ చేశారు. గత నెలలో విహార యాత్రకు వెళ్లిన పర్యాటకులపై పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసి 26 మంది ప్రాణాలు తీశారు. అప్పటినుంచే పాకిస్థాన్‌పై అన్నివైపులా భారత్ ఒత్తిడి తీసుకురావడం ప్రారంభించింది. ఇప్పుడు ఉగ్రస్థావరాలపై భారత సైన్యం దాడి చేయడంతో దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారిపోయింది. ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పారంటూ కేంద్ర ప్రభుత్వాన్ని, భద్రతా బలగాలను ప్రశంసిస్తున్నారు.



## పాక్‌పై దాడులతో దేశం గర్విస్తోంది

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 7 :** ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో దేశవ్యాప్తంగా గర్వభావాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'జై హింద్!' అంటూ ప్రారంభించిన ఆయన ప్రకటనలో, సాయుధ దళాల విజయంపై ప్రశంసల జల్లు కురిపించారు. దేశ సరిహద్దుల్లో సైన్యం చూపిన ధైర్యాన్ని చూసి గర్విస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర ప్రజలకు ఎలాంటి భయం అవసరం లేదని, నగరంలోని పరిస్థితులు పూర్తిగా అదుపులో ఉన్నాయని మంత్రి భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల భద్రత చర్యలు చేపడుతోందని వెల్లడించారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా ఏదైనా కనిపించినా, వెంటనే సమీప పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. భారతదేశం అంతర్భాగంలో కానీ, సరిహద్దుల్లో కానీ మనం ఎప్పుడూ గెలవాలని, ఎప్పుడూ ధైర్యంగా ఉండాలని, ఎవరికీ తలవంచాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే భద్రతా చర్యలకు తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. అంతర్గత భద్రత విషయంలో కేంద్రం కఠినంగా వ్యవహరించాలని కాంగ్రెస్ తీర్మానించినట్లు- తెలిపారు. హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులతో తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. చివరగా, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పదంగా ఏదైనా కనిపించినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.



## కర్రెగుట్టల్లో ఎదురు కాల్పులు..

### 26 మంది మావోయిస్టులు మృతి

**చర్ల:** తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ మేరకు అధికార వర్గాలు వెల్లడించాయి. ఘటనా స్థలంలో కాల్పులు కొనసాగుతున్నాయి. ఈ ఆపరేషన్‌ను డీఆర్జీ, కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఏఎఫ్ బలగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. దీన్ని ఏడీజీ వివేకానంద సిన్హా పర్యవేక్షిస్తున్నారు. సీఆర్పీఎఫ్ ఐజీ రాకేశ్ అగర్వాల్, బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందరరాజ్ ఎప్పటికప్పుడు ఆపరేషన్‌పై ఆరా తీస్తున్నారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అల్లూరి జిల్లాలో ఎదురుకాల్పులు.. నలుగురు మావోయిస్టులు మృతి మరోవైపు, ఏపీలోని అల్లూరి జిల్లా వై.రామవరం, జీకేవీధి మండలాల సరిహద్దుల్లో భద్రతాబలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ క్రమంలోనే రెండు ఏకే-47లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఘటనాస్థలంలో ఇరుపక్షాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి.

## ఆపరేషన్ సిందూర్ సరైన పేరు

- ఉగ్రమూకలపై దాడితో అమరుల ఆత్మశాంతి
- దాడిలో మరణించిన వినయ్ నర్వాల్ సతీమణి హిమాన్షీ

**న్యూఢిల్లీ, మే 7 :** పాక్ ఉగ్రమూకపై భారత ప్రభుత్వం చేపట్టిన మిలిటరీ యాక్షన్‌కు 'ఆపరేషన్ సిందూర్' సరైన పేరని.. పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన నేవీ అధికారి వినయ్ నర్వాల్ సతీమణి హిమాన్షీ అభిప్రాయపడ్డారు. ఆమె ఓ ఆంగ్ల మీడియా సంస్థతో మాట్లాడుతూ ప్రభుత్వం సరైన చర్యలు తీసుకొందని.. భవిష్యత్తులోనూ కొనసాగించి ఉగ్రవాదాన్ని అంతం చేయాలని కోరారు. ఉగ్రవాదాన్ని అంతం చేసి దేశానికి శాంతి తీసుకురావాలన్న లక్ష్యంతోనే నా భర్త రక్షణ దళాల్లో చేరారు. ఇప్పుడు ఆయన లేకపోయినా.. ఆ స్ఫూర్తి మాత్రం ఉంది. అమాయకుల ప్రాణాలు తీసి.. వారి కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసిన వారికి పడినశిక్ష చూసి ఆయన ఆత్మ శాంతించి ఉంటుంది. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలి. నాలాంటి పరిస్థితి మరే కుటుంబానికి రాకూడదని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ పేరు సరిగ్గా సరిపోయింది. నాకు ఇటీ-వలే పెళ్లయ్యింది. నా జీవితాన్నివారు లాగేసుకొన్నారు. ఒక్క క్షణంలో నా జీవితం తల్లకిందులైంది. నాతోపాటు- చాలా మంది జీవితాలు దెబ్బతిన్నాయి. పురుషులు కూడా తండ్రిని, సోదరుడిని కోల్పోయారని మరోమారు దుఃఖించారు. నేను ఎంత బాధను అనుభవిస్తున్నానో చెప్పలేను. కానీ, ఈ చర్యతో కొంత ఊరట వచ్చింది.



ఉగ్రవాదం అంతానికి ఇదే ఆరంభం. పహల్గాం ఉగ్రదాడిలో మృతులకు అమరవీరుల హోదా ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ పై హిమాన్షీ తండ్రి సునీల్ స్వామి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులు బాధితులను వెళ్లి మోదీకి చెప్పమన్నారు. ఇప్పుడు మోదీజీ చెప్పారు. ప్రభుత్వం ఉగ్రవాదులకు తగిన జవాబు ఇస్తుందని నేను నా కుమార్తెకు చెప్పాను. పాక్‌పై దాడులను తాము స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు.



## చిరుతల్లాంటి మహిళా ఆఫీసర్లు

### వ్యోమికా సింగ్.. సోఫియా ఖురేషి

**న్యూఢిల్లీ, మే 7 :** జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలపై భారత ఆర్మీ మెరుపు దాడి చేసింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు నిర్వహించగా.. దాదాపు 100 మంది వరకు ఉగ్రవాదులు హతమైనట్లు- తెలుస్తోంది. భారత్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై బుధవారం ఉదయం విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వివరాలు వెల్లడించారు. మిస్రీతో పాటు ఇద్దరు మహిళా అధికారులు కూడా ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. భారత చరిత్రలోనే తొలిసారిగా ఇద్దరు మహిళా అధికారులు సైనిక్ ఆపరేషన్‌పై అధికారిక విలేకరుల సమావేశానికి నాయకత్వం వహించారు. ఇప్పుడు వీరిద్దరి గురించే యావత్ భారత్ చర్చించుకుంటోంది. కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఈ క్లిష్టమైన ఆపరేషన్ గురించి చెప్పుకొచ్చారు. ఈ ఇద్దరు మహిళా అధికారులు ఎవరన్నది ఆసక్తి కలిగిస్తోంది. పైలెట్ కావాలన్నది వ్యోమికా సింగ్ కల. అందుకోసం ఎంతో కష్టపడ్డారు కూడా. ఇంజనీరింగ్ పూర్తి చేసిన వ్యోమికా.. తన కలను తీర్చుకునే దిశగా అడుగులు వేశారు. ఇందులో భాగంగానే 2004లో ఐఏఎఫ్‌లో చేరారు. 2017లో వింగ్ కమాండ్ హోదా పొందారు. డిసెంబర్ 18, 2019న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో కూడా చేతక్, చీతా హెలికాప్టర్లను వ్యోమికా సింగ్ నడిపి రికార్డు సృష్టించారు. వైమానికి రంగంలో ఎంతో పేరు పొందారు. హై-రిస్క్ ఫ్లయింగ్ ఆపరేషన్లలో వ్యోమికా సింగ్ సేవలందించారు. సోఫియా ఖురేషీ స్వస్థలం గుజరాత్. 1990లో సోఫియా సైన్యంలో చేశారు. కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్‌కు చెందిన లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషి.. 2016లో పుణెలో జరిగిన ఎక్సర్‌సైజ్ 18 పేరిట భారత ఆర్మీకి చెందిన బృందానికి నాయకత్వం వహించి తొలి మహిళా అధికారిగా చరిత్ర సృష్టించారు. ఇందులో 18 దేశాలు పాల్గొనగా.. కేవలం భారత్ బృందానికి మాత్రమే మహిళ నాయకత్వం వహించారు. ఆమెకు పీస్ కీపర్‌గా ఎంతో అనుభవం ఉంది. 2006 కాంగోలో పీస్ మిషన్‌కు ఆమె అందించిన సహకారం ప్రత్యేకంగా నిలిచింది. ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వకారణం. మూడు దశాబ్దాలకు పైగా భారత సైన్యానికి సేవలందించారు. ఆమె రాజీలేని వైఖరి, నిర్భయ ప్రయత్నాలతో ఎన్నో ప్రశంసలను అందుకున్నారు. అలాగే దేశ యువతను భారత సైన్యంలో చేరాలని కూడా సోఫియా ఖురేషి పిలుపునిచ్చారు.



## ఆర్మీని చూసి గర్విస్తున్నాం : కాంగ్రెస్

**న్యూఢిల్లీ, మే 7 :** ఆపరేషన్ సిందూర్ ను చేపట్టిన భారత ఆర్మీని చూసి గర్విస్తున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. పాక్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రస్థావరాలపై భారత బలగాల దాడుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సచిన్ పైలట్ తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రస్తుత పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఉగ్ర స్థావరాలపై ఉక్కుపాదం మోపిన భారత సాయుధ దళాలను చూసి గర్విస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. ఇక, ఆపరేషన్ సిందూర్ పై ఖర్గే మాట్లాడుతూ.. దేశ రక్షణ విషయంలో సైనికులు తీసుకొనే ప్రతి నిర్ణయానికీ కాంగ్రెస్ మద్దతు ఉంటుందని తెలిపారు.దేశ రక్షణ కోసం మనమంతా ఐక్యంగా ఉండాలని ఖర్గే అన్నారు. కాగా, భారత సాయుధ దళాలు.. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని బహవల్‌పూ-ర్‌లోని జైష్-ఎ-మొహమ్మద్ ప్రధాన స్థావరంతోపాటు మురిడ్కేలోని లష్కరే-ఎ-తోయిబా వంటి తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని మిస్సైల్స్ తో విరుచుకుపడ్డాయి. భారత సైనికుల దాడుల్లో భారీగా ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం.



## హైదరాబాద్‌లో విజయవంతంగా మాక్ డ్రిల్

### సైరన్ మోగడంతో పలుచోట్ల ప్రజల అప్రమత్తం

**హైదరాబాద్, మే 7 :** పాకిస్తాన్ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ సాయంత్రం 4 గంటలకు మొదలైంది. మొదట నగరంలో పలుచోట్ల సైరన్లు మోగాయి. హైదరాబాద్ నగరంలో పలుచోట్ల సైరన్లు మోగాయి. ప్రధాన కూడళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద సైరన్లు మోగించారు. అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరిం చాల్సిన విధానంపై అవగాహన కోసం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రజలు, సహాయక సిబ్బంది వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించేందుకు పోలీసుల మాక్‌డ్రిల్ నిర్వహించారు. హైదరాబాద్‌లో నాలుగు ప్రాంతాల్లో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహణ జరిగింది. నానల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, ఈసీఐఎల్ ఎన్ఎఫ్‌సీ ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. సివిల్ మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది, రక్షణశాఖ, అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. సికింద్రాబాద్, గోల్కొండ, కంచన్ బాగ్ డీఆర్ డీఓ, మౌలాలి ఎన్ఎఫ్‌సా÷ఖలో అధికారులు మాక్ డ్రిల్ జరగ్గా.. వైమానిక దాడి జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆపరేషన్ అభ్యాస్ పేరుతో 12 సివిల్ డిఫెన్స్ సర్వీసెస్ అధికారులు అవగాహన కల్పించారు. దాదాపు అరగంట పాటు ఈ కార్యక్రమం కొనసాగింది.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# భారత్ గర్జన

## సింధూరం మెరిసింది..




సగం ప్రపంచమంతా నిద్రపోతున్నది. సగం ప్రపంచం తమ పనుల్లో నిమగ్నమయ్యింది. నిదుర పోయిన వారికి ఏం జరిగిందో తెలియలేదు. పట్టపగలు అయినా మిగతా సగం ప్రపంచం గుర్తించలేదు. సరిగ్గా పహల్గామ్ దాడి జరిగిన పక్షం రోజులకు అర్ధరాత్రి వేళ - భారత ప్రతీకారాగ్నితో ప్రత్యర్థి పాక్ గగన తలం సింధూర కాంతులతో ఎరుపెక్కింది. పాక్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లో టెర్రరిస్టులు దాక్కున్న తొమ్మిది కలుగుల్లోకి దూరి భారతీయ విస్ఫోటక అస్త్రాలు నేలమట్టం చేశాయి. వాటిల్లో దాక్కున్న టెర్రరిస్టులు ఎంతమంది చచ్చారో లెక్క తేలాల్సివుంది. అంచనాకైతే వందమందికి పైనే వుంటారని తెలుస్తోంది. అర్ధరాత్రి చిమ్మచీకట్లో ఫెళఫెళార్భటులతో శత్రుభూమిలో నిప్పులు కురిపిస్తూ భారత్ జరిపిన ఈ దాడి అని తెల్లారేసరికల్లా తెలిసి యావత్తు ప్రపంచం ఉలిక్కి పడింది. పాకిస్తాన్ వెన్నులో అయితే వణుకే పుట్టింది. ఉన్మాదుల కాల్పుల్లో తమ భర్తల్ని కోల్పోయిన భారత స్త్రీలు- ముష్కర స్థావరాల్ని పేల్చేసిన భారతీయ అస్త్రాలు రగిల్చిన సింధూర కాంతుల్న చూసి గర్వంతో ఉప్పొంగే వుంటారు. చరిత్రలో నిలిచిపోయే ఈ భారతీయ ప్రతీకార దాడికి ప్రపంచదేశాలన్నీ దన్నుగా నిలిచాయి. భారత్‌ను దోషిగా నిలబెట్టాలని చివరి క్షణంలో పాకిస్తాన్ భద్రతాసమితిలో చేసిన దింపుడు కళ్లెం ప్రయత్నం బెడిసికొట్టింది. ఒక్కదేశం కూడా పాక్ తో కలిసి రాలేదు. రెండువాలాల పాటు పకడ్బందీగా తెరవెనుక యుద్ధ వ్యూహాలు పన్ని, అందరి మద్దతు కూడగట్టి, పటిష్టమైన నిఘా వ్యూహం పన్ని నిర్వహించిన ఈ ఆపరేషన్‌కు ఆపరేషన్ సింధూర్ అని నామకరణం చేశారు. కాగల కార్యం మన సేన అత్యంత పకడ్బందీ వ్యూహంతో నిర్వహించిన తీరు అభినందనయం. మతం పేరిట జరిపిన మారణహోమంలో నిష్కరణంగా ప్రాణాలు కోల్పోయిన అమాయక హిందూ పర్యాటకుల ఆత్మలు శాంతించాయని భావిద్దాం. ఇంతటితో ఊరుకో... దుస్సాహసానికి దిగితే సర్వనాశనం తప్పదు అని అమెరికా పాకిస్తాన్ కి చేసిన హెచ్చరికతో కూడిన హితవుకి తల ఒగ్గిందా సరే... లేకుంటే మళ్ళీ కల్లో కూడా వూహించడానికి భయంతో చచ్చేలా గుణపాఠం చెప్పడానికి భారతీయ సేనలు సరిహద్దుల్లో మోహరించాయి. తమ భర్తలను చంపిన మతోన్మాదుల రక్తంతో మన సోదరీమణుల ఎదుట తిలకం దిద్దిన సైన్యం సాహసానికి వందనం. మొత్తంగా కొందరు అనుకున్నట్లుగా కాకుండా ..ఆలస్యం లేదంటూనే.. భారత్ గర్జించింది. తన సత్తా ఏమిటో చాటింది. మనమేంటో మరోమారు పాక్‌కు రుచి చూపింది. పాముకు పాలుపోసి పెంచుతున్న ఉగ్రమూకల పుట్టలను పగులగొట్టింది. పహల్గామ్ ఊచకోత జరిగిన సరిగ్గా పక్షం రోజలకు అర్ధరాత్రి వేళ పాక్‌పై భారత్ యుద్ధవిమానాలు దాడికి దిగాయి. లక్ష్యాన్ని ఛేదించాయి.

ఉగ్రస్థావరాలు లక్ష్యంగా చేసిన మెరుపుదాడితో పాక్ ఉక్కిరిబిక్కిరి అయ్యింది. ఉగ్రవాదులను మట్టుబెట్టే క్రమంలో కేవలం వారి స్థావరాలనే ఎంచుకుని లక్ష్యిత దాడులకు దిగింది. 9చోట్ల దాడులతో వందకు పైగానే ఉగ్రవాదులు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. గత పాలకులు నెహ్రూ, ఇందిరాగాంధీల దూరదృష్టి లోపం వల్ల పాక్‌తో నిరంతరంగా ఉగ్రవాదులను ఎగదోస్తోంది. నాకేం తెలియదని నంగనాచి కబుర్లు చెబుతోంది. అప్పట్లో జరిగిన యుద్ధాల్లో పాక్ జట్టు మనచేతికి వచ్చినా పాక్‌ను దయతలచి వదిలి పెట్టడం జరిగింది. ఏకుమేకు అయిన చందంగా పాక్ పక్కలో బల్లెంగా మారింది. అందుకుభారీ మూల్యం చెల్లించుకుంటూనే ఉన్నాం. ఆనాడే 90వేల మది సైన్యం భారత్ చేతికి చిక్కినా.. పాక్ ఆక్రమిత కాశ్మీర్ గురించి పట్టుబట్టలేదు. అనేక విషయాలను అలాగే వదిలేశాం. ఇలా చేయడంతో ఇంతకాలం మనం ఎన్నో ఉగ్రదాడులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎంతగా అంటే మొన్నటికి మొన్న పాక్ ఉగ్రమూకలు పహల్గామ్‌లో అమాయకులైన హిందువులు 27మందిని అమానుషంగా కాల్చి పారేశారు. హిందువా కాదా అని తేల్చుకుని మరీ కాల్చారు. ఇంతకన్నా దారుణం మరోటి లేదు. భారత్‌ను చీల్చుకుని పుట్టుకొచ్చిన పాక్, బంగ్లాలు తల్లిపాలు తాగి రొమ్ముగుద్దిన చందాన వ్యవహరిస్తున్నాయి. వారికి సరైన రీతిలో బుద్ధి చెప్పాల్సిన సమయంలో ఇప్పుడు భారత ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుని ఆపరేషన్ సింధూర్‌ను అమలు చేసింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌తో పాటు, పాక్ భూభాగంలోని మొత్తం 9 ఉగ్రస్థావరాల పై అర్ధరాత్రి దాటిన తరవాత విరుచుకుపడి దాడులు చేసింది. అరగంటలోపే లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అందరూ నిద్రపోతున్న వేళ..ఎలాంటి అలజడి లేకుండా భారత సైన్యం లక్ష్యం పూర్తి చేసింది. మూడో కంటికి తెలియకుండా...ఇంతకాలం భారత్ ఏంచేస్తుందో కూడా ఊహకందని విధంగా దాడులతో సమాధానం ఇచ్చింది.

ఇది ఇంతటితోనే ఆగుతుందని అనడానికి లేదు. పాక్ నుంచి వచ్చే ప్రతిస్పందన ఆధారంగా మన దాడులు మరింతగా ఉండే అవకాశం లేకపోలేదు. దేశానికి గుదిబండగా ఉన్న కాశ్మీర్ 370 ఆర్టికల్ రద్దు అయ్యాక అక్కడ ప్రశాంత వాతావణం ఏర్పడి, పర్యాటకం మళ్లీ పురివిప్పింది. దీనిని చెడగొట్టే లక్ష్యంతో పాక్ కుట్రలు పన్నుతోంది. అవకాశం దొరికినప్పుడల్లా కాశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికలపై లేవనెత్తుతోంది. దరిమిలా ఉగగ్రవాద గ్రూపులు పెట్రేగుతున్నాయి. బిజెపి అధికరాంలోకి వచ్చాక జమ్ము కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన బిల్లును రద్దు చేయడంతో ఉగ్రవాదులకు పాలుపోవడం లేదు. కాశ్మీర్‌లో ఉగ్రవాదు ఏరివేతతో పాటు దేశానికి రావణకాష్టంలా రగులుతున్న కాశ్మీర్‌కు చికిత్స చేయడం ద్వారా బిజెపి సాహసోపేత చర్యలకు పూనుకుంది. అక్కడ మళ్లీ పచ్చదనం వెల్లివిరిసింది. స్వేచ్ఛగా పౌరులు అక్కడకు వెళ్లడం అలవాటు చేసుకున్నారు. అయితే వక్రబుద్ధితో ఉన్న పాక్ ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి ఉసిగొల్పింది. ఈ క్రమంలో జరిగిన దాడే పహల్గామ్ ఊచకోతగా చూడాలి. ఇక ఎంతమాత్రం ఉపేక్షించమని భారత్చేసిన హెచ్చరికతో పాక్ దారికి రావాలి. లేకుంటే ప్రపంచ పటంలో పాక్ ఆనవాళ్లు కూడా ఉండవని గుర్తించాలి.

# భారత్ ఆపరేషన్ సిందూర్

- పాక్ గడ్డపై బాంబుల వర్షం
- ఉగ్రస్థావరాలు లక్ష్యంగా దాడులు
- కనీసం వందకు పైగానే ఉగ్రవాదుల హతం
- వివరాలు వెల్లడించిన ఆర్మీ అధికారులు



**న్యూఢిల్లీ, మే 7 :** భారత ఉద్ద విమానాలు మరోమారు గర్జించాయి. పాక్ భూభాగంలోని ఉగ్రమూకలు లక్ష్యంగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. అర్ధరాత్రి వేళ మన విమానాలు దాయాది ఆక్రమణలో ఉన్న ఆక్రమిత కాశ్మీర్ సహా పాక్‌లోని మొత్తం 9 ఉగ్రస్థావరాలను వైమానికదథలం ధ్వంసం చేసింది. కేవలం అరగంటలోనే ఈ తొమ్మిది స్థావరాలు భస్మీపటలం అయ్యాయి. ఈ విశేషాలను కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ప్రత్యేకంగా విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. పాక్‌లోని 4, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 స్థావరాలపై దాడులు చేసినట్లు- తెలిపారు. ఈసందర్భంగా కోట్లీలోని గుల్పూర్ టెర్రర్ క్యాంప్‌పై ఎలా దాడి చేశామనేది సోఫియా ఖురేషి వీడియో ప్రదర్శించారు. ఇక్కడే గతంలో 'ఫూంచ్' దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు శిక్షణ తీసుకున్నారంటూ పేర్కొన్నారు. అర్ధరాత్రి 1.05 నుంచి 1.30 గంటల వరకు ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. దాదాపు 25 నిమిషాల పాటు సాగింది. పహల్గాం మృతులకు న్యాయం చేసేందుకే ఆపరేషన్ సిందూర్ నిర్వహించామని పేర్కొన్నారు. భావల్పూర్ టెర్రర్ క్యాంప్ అంతర్జాతీయ సరిహద్దుకు 30 కి.మీ. దూరంలోనే ఉంటుంది. లష్కరే తోయిబాకు చెందినదిగా గుర్తించాం. రాజౌరి - ఫూంచ్ ప్రాంతాల్లో ఇందులోని ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారు. ఇక్కడే 2023, 2024లో ఫూంచ్ దాడుల్లో కీలకంగా వ్యవహరించిన ఉగ్రవాదులు శిక్షణ పొందినట్లు మాకు సమాచారం ఉందని సోఫియా తెలిపారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 28 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ హస్తం ఉన్నట్లు- పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపించాయి. ఈ నేపథ్యంలోనే లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్రవాద సంస్థలపై భారత్ సైన్యం విరుచుకుపడింది. భారత్ జరిపిన దాడుల్లో దాదాపు 100 మందికి పైగా ఉగ్రవాదులు చనిపోయినట్లు- తెలుస్తోంది. అంతేకాకుండా పలువురు తీవ్రంగా కూడా గాయపడ్డారని సమాచారం. అయితే, భారత్ ప్రతికారంపై దేశ వ్యాప్తంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం జరిగిందంటూ పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో మోడీ భేటీ

- ఆపరేషన్ సిందూర్‌పై వివరించిన ప్రధాని
- నేడు అఖిలపక్ష సమావేశానికి ప్రభుత్వం పిలుపు



**న్యూఢిల్లీ, మే 7 :** పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార చర్యలు చేపట్టింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై విరుచుకుపడింది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ముర్ముతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం చేపట్టిన దాడుల గురించి రాష్ట్రపతికి ప్రధాని వివరించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశానికి పిలుపు నిచ్చింది. గురువారం ఉదయం 11 గంటలకు జరగబోయే ఈ భేటీలో.. 'ఆపరేషన్ సిందూర్' తదనంతర పరిణామాలను ఆయా పార్టీల నేతలకు ప్రభుత్వం వివరించనుంది. జాతీయ భద్రత విషయంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు- సమాచారం. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోంశాఖ మంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు తదితరులు ఈ భేటీకి హాజరుకానున్నారు. మరోవైపు భారత మెరుపుదాడులను విపక్ష నేతలు స్వాగతించారు. పాకిస్థాన్ ఉగ్ర చర్యలకు వ్యతిరేకంగా భారత్ తీసుకునే ఎలాంటి నిర్ణయాల-కై-నా తమ మద్దతు ఉంటు-ందని ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఈ మధ్యాహ్నం 3 గంటలకు కాంగ్రెస్ నిర్వహించనుంది. ప్రస్తుత పరిణామాలపై కాంగ్రెస్ నేతలు ఈ భేటీ-లో చర్చించనున్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సరిహద్దు రాష్ట్రాల సీఎంలు, గవర్నర్లు, డీజీపీలు, ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష చేపట్టనున్నారు. ఈ భేటీ-కి జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, సిక్కిం, పశ్చిమబెంగాల్ సీఎంలు, గవర్నర్లు, అధికారులు హాజరుకానున్నారు. ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. పాక్‌లోని 4, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 స్థావరాలపై దాడులు చేసింది. ఇప్పటివరకు అక్కడ 80 మంది వరకు ఉగ్రవాదులు మృతి చెందినట్లు వార్తలొస్తున్నాయి. బవహల్పూర్(జైషే మహమ్మద్), మురిద్కే (లష్కరే తొయిబా) క్యాంపుల్లోనే అత్యధిక మంది ఉగ్రవాదులు చనిపోయినట్లు- తెలుస్తోంది.

## ఉగ్రస్థావరాలను గుర్తించడంలో
# కీలక భూమిక

- తెరవెనక పనిచేసిన ఎన్‌టిఆర్‌వో సంస్థ
- అది ఇచ్చిన ఖచ్చిత సమాచారంతోనే దాడులు

**న్యూఢిల్లీ, మే 7 :** పహల్గామ్‌కు భారత సైన్యం ప్రతీకారం తీర్చుకున్న వేళ లక్ష్యాన్ని ఖచ్చితంగా గుర్తించడంలో కీలక పాత్ర ఎవరన్నది చర్చ సాగుతోంది. ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక ఉన్న ఏజెన్సీ ఏంటి? అనే విషయాలపై చర్చ సాగుతోంది. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ఇండియన్ ఆర్మీ నేలమట్టం చేసింది. దాడిలో సుమారు 30 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టింది. బుధవారం తెల్లవారుజామున భారత సాయుధ దళాలు బహవల్‌పూర్‌లోని జైష్-ఎ- మొహమ్మద్ బలమైన స్థావరం, మురిద్కేలోని లష్కరే-ఎ-తోయిబా స్థావరంతో సహా తొమ్మిది ఉగ్రవాద లక్ష్యాలపై క్షిపణి దాడులు నిర్వహించాయి. అయితే, పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు దాక్కున్న ప్రదేశాలను భారతదేశం ఎలా ట్రాక్ చేసిందన్న ప్రశ్న ఉదయిస్తోంది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో దాక్కున్న ఉగ్రవాదులను జాతీయ సాంకేతిక పరిశోధన సంస్థ ఎన్‌టిఆర్‌ఓ గుర్తించింది. వారి స్థానాల గురించి నిఘా సమాచారాన్ని అందించింది. భారత దాడుల్లో అనేక మంది అగ్ర ఉగ్రవాద కమాండర్లు మరణించి ఉండవచ్చని భారత సైన్యం అంచనా వేస్తోంది. ఎన్‌టిఆర్‌వో అనేది 2004లో స్థాపించబడిన భారతదేశ సాంకేతిక నిఘా సంస్థ. ఇది జాతీయ భద్రతా సలహాదారు, ప్రధాన మంత్రి కార్యాలయం కింద పనిచేస్తుంది. అధునాతన సాంకేతిక నిఘాను సేకరించడం, భారతదేశ జాతీయ భద్రతను కాపాడటంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా ఉగ్రవాదం, సైబర్ బెదిరింపులు, సరిహద్దు ముప్పులను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కిక్ష అత్యాధునిక సాంకేతికత పరికరాలను ఉపయోగించడం వలన ఉగ్రవాదులను ట్రాక్ చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది.

# ఆపరేషన్ సింధూర్ మనందరికీ గర్వకారణం

- పహల్గామ్‌కు భారత్ ప్రతీకార దాడి
- కేబినేట్ సమావేశంలో ప్రధాని మోడీ వివరణ

**న్యూఢిల్లీ, మే 7 :** పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార దాడులు చేసింది. దీనికి సంబంధించి బుధవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ దాడి గురించి ప్రధాని మోడీ సభ్యులకు వివరించారు. ఇది మనందరికీ గర్వకారణమైన క్షణమని ఆయన హర్షం వ్యక్తం చేసినట్లు- తెలుస్తోంది. భద్రతాబలగాలు చేసిన కచ్చితమై దాడిగా 'ఆపరేషన్ సిందూర్'ను అభివర్ణించారని సమాచారం. పీఓకేలో ఐదు, పాక్‌లో నాలుగు ఉగ్రశిబిరాలను ఎలా లక్ష్యంగా చేసుకున్నారో ప్రధాని వారికి చెప్పారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి తర్వాత దేశ ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఆ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ దేశాన్ని నడిపిన తీరును సభ్యులు కొనియాడారని తెలుస్తోంది. ఈ క్యాబినెట్ మీట్ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మోదీ కలిశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి వీరు సమావేశం అయ్యారు. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇదిలా ఉంటే.. 'ఆపరేషన్ సిందూర్'ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యక్షంగా పర్యవేక్షించిన సంగతి తెలిసిందే. ఇక, ఉగ్రవాద శిబిరాలపై దాడులను భారత ఉన్నతాధి కారులు ప్రపంచ దేశాలకు వివరించారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసినట్టు- అమెరికా, రష్యా, యూకే, సౌదీ అరేబియా, యూఏఈకి సమాచారం అందించారు. మెరుపు దాడులపై వాషింగ్టన్ డీసీలోని భారత ఎంబసీ ప్రకటన విడుదల చేసింది. పాక్ పౌరులు, ఆర్థిక, సైనిక స్థావరాలపై దాడి చేయలేదని స్పష్టం చేసింది. ఈమేరకు అమెరికా విదేశాంగ కార్యదర్శితో .. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దభోల్ మాట్లాడారు. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో సేదదీ-రుతున్న పర్యాటకులను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నారు. ముఖ్యంగా జంటల్లో పురుషులను వేరు చేసి.. వారిని మతం అడిగి మరీ కాల్చి చంపారు. ఉగ్రమూక టార్గెట్ చేసిన జంటల్లో అప్పటికి ఆరు రోజుల క్రితమే పె÷-ళ్లైన నవవధూవరులు వినయ్ నర్వాల్, హిమాన్షి ఉన్నారు. -టె-ర్రరిస్టులు వినయ్‌ను హత్య చేయగా.. అతడి మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న హిమాన్షి చిత్రం దేశం మొత్తాన్ని కుదిపేసింది. వినయ్ నేవీ అధికారి కూడా. ఈ ఉగ్ర దాడిలో భర్తలను కోల్పోయిన మహిళల ప్రతీకారానికి చిహ్నంగా దీనిని చూడొచ్చు. యోధులకు పెట్టే వీరతిలకం అనే అర్థం కూడా దీనిలో ఉంది.



## ఓ వైపు ఆపరేషన్ సింధూర్
# మరోవైపు మాక్ డ్రిల్

**న్యూఢిల్లీ, మే 7 :** పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమంటున్న వేళ... 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత్ మెరుపు దాడులతో గట్టి సమాధానం ఇచ్చింది. అది జీర్ణించుకోలేని పాకిస్థాన్ తామూ దాడులు చేస్తామని ప్రేలాపనలు పేలుతోంది. మరోవైపు దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సంక్షోభ సమయంలో పౌరులు ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అన్న అంశంపై అవగాహన కల్పించాలని కేంద్రహోం శాఖ నిర్ణయించింది. దానిలో భాగంగా దేశవ్యాప్తంగా సాయంత్రం నాలుగు గంటలకు మాక్ డ్రిల్స్ ప్రారంభమయ్యాయి. ఈ మాక్ డ్రిల్స్‌లో పాల్గొనాలని ఆయా జిల్లా అధికార యంత్రాంగాలు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు, హోమ్‌గార్డ్స్, ఎన్‌సీసీ కోర్, ఎన్ఎస్ఎస్, నెహ్రూయువ కేంద్ర సంఘటన్, కాలేజ్‌లు, స్కూల్ విద్యార్థులకు ఇప్పటికే కేంద్రం పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.దేశవ్యాప్తంగా 244 జిల్లాల్లోని 259 లొకేషన్లలో మాక్ డ్రిల్స్ నిర్వహించారు. దాదాపు 50 సంవత్సరాల తర్వాత దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపట్టడం గమనార్హం. కార్గిల్ యుద్ధ సమయంలో అవి సరిహద్దు జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్ వంటి సరిహద్దు రాష్ట్రాలకే పరిమితం అయ్యాయి. ఈ సారి మాత్రం దేశవ్యాప్తంగా కీలక ప్రదేశాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. శత్రు యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లు దూసుకొస్తున్న వేళ ప్రజల సన్నద్ధత కోసం వీటిని నిర్వహిస్తున్నారు. ఇందులో సైరన్ అత్యంత కీలకమైంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సైరన్ మోతలు వినిపించాయి.

## ఆపరేషన్ సింధూర్‌పై
# విదేశాలకు సమాచారం
### ఆయా దేశాలకు తెలియచేసిన అజిత్ ధోవల్

**న్యూఢిల్లీ, మే 7 :** పహల్గామ్ ఉగ్రదాడికి భారత్ ఆపరేషన్ సిందూర్‌తో ప్రతీకారం తీర్చుకుంది. పీఓకే, పాకిస్తాన్‌లోని మొత్తం 9 ఉగ్రస్థావరాలపై 24 దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాదులు పదుల సంఖ్యలో మరణించారు. అయితే, ఈ దాడుల గురించి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ప్రపంచదేశాలకు వివరించారు. భారతదేశానికి ఉద్రిక్తతల్ని పెంచే ఉద్దేశ్యం లేదని, ఒక వేళ పాకిస్తాన్ దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, దృఢంగా ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు- మిత్ర దేశాలకు వెల్లడించారు. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్లో ఉగ్రవాద స్థావరాలపై భారత్ ఎటాక్ చేసిన తర్వాత, అజిత్ దోవల్ యూకే, యూఎస్, సౌదీ అరేబియా, జపార్, రష్యా, ఫ్రాన్స్‌లతో మాట్లాడారు. తాము ఉగ్రవాద స్థావరాలను మాత్రమే టార్గెట్ చేశామని, సామాన్య ప్రజలు, పాక్ ఆర్మీ ఆస్తులపై దాడులు నిర్వహించలేదని తెలిపారు. భారత్ తీసుకున్న చర్యలు, అమలు చేసిన విధానం గురించి దోవల్ తన సహచరులతో పంచుకున్నారు. భారత్‌కు ఘర్షణను పెంచే ఉద్దేశ్యం లేదని, కానీ పాకిస్తాన్ తీవ్ర తరం చేయాలనుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. దోవల్ అమెరికా ఎన్ఎస్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, యూకే జోనాథన్ పావెల్, సౌదీ అరేబియా ఎన్ఎస్ఏ ముసైద్ అల్ ఐబాన్, యూఏఈ అధికారి షేక్ తహ్నూన్, జపాన్ అధికారి మసటాకా ఒకానోలతో మాట్లాడారు. చైనా సీపీసీ సెంట్రల్ కమిటీ- పొలిట్ బ్యూరో సభ్యుడు, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి, ఫ్రెంచ్ అధ్యక్షుడి దౌత్య సలహాదారు ఇమ్మాన్యయేల్ బోనేతో మాట్లాడారు.

# ఉగ్రవాద శిబిరాలను తుదముట్టించాలి
### ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతించిన ఓవైసీ

**హైదరాబాద్, మే 7 :** పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో మెరుపుదాడులు చేయడాన్ని ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ స్వాగతించారు. ఉగ్రవాద శిబిరాలను తుదముట్టించేందుకు మరిన్ని దాడులుచేయాలన్నారు. ఈ ఆపరేషన్ సిందూర్‌పై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సానుకూలంగా స్పందించారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత రక్షణ బలగాలు చేసిన దాడులను తాను స్వాగతిస్తున్నానని అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. పాకిస్తాన్ ఉగ్రవాదులపై ఇంకా కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను పూర్తిగా నాశనం చేయాలని చెప్పారు. జై హింద్.. ఆపరేషన్ సిందూర్ అని అసదుద్దీన్ ఒవైసీ పూర్తి మద్దతు పలికారు.



పీర్జాదిగూడ నగర 15వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారి మంజుల రవీందర్ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా డివిజన్ ప్రజలు ఆయన నివాసంలో పూలమాలతో సత్కరించి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవి రమణారెడ్డి, సంఘపాక సుధాకర్, జయరాం, సందీప్ నేత, మనోహర్ రెడ్డి, సత్యంచారి, యువ నాయకులు బత్తి సుమిత్ పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

### లక్కారం ఆదర్శ పాఠశాల,కళాశాల ప్రిన్సిపాల్ పి.అజరయ్య



**చౌటుప్పల్, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ లోని ఆదర్శ పాఠశాల,కళాశాలల్లో 2025 –26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పురపాలక కేంద్రం లక్కారం పరిధిలోని ఆదర్శ పాఠశాల,కళాశాల ప్రిన్సిపాల్ పి.అజరయ్య ఓ ప్రకటనలో వెల్లడించారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధిం చిన విద్యార్థులు ఆన్లైన్లో మే 5 నుండి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. అలాగే ఎంపికైన విద్యార్థుల జాబితాను పాఠశాల నోటీస్ బోర్డులో ఉంచుతా మన్నారు. విద్యార్థులు ఎస్.ఎస్.సీ పబ్లిక్ పరీక్షల్లో సాధించిన మెరిట్,రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధన ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. కళాశాలలో ఎంపీసీ,బైపిసి,సీఈసి,ఎం ఈసి గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి గ్రూపులో 40 సీట్లు కేటాయించబడుతుందని తెలిపారు.ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన,ఉచిత పాఠ్యపుస్తకాలు,ఉచిత యూనిఫామ్ అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఎంసెట్,నీట్ లపై కెరీర్ కౌన్సిలింగ్ అందించబడుతుందని తెలిపారు. ఇంటర్ మొదటి,ద్వితీయ సంవత్సరం చదువుతున్న దూరప్రాంత విద్యార్థినీలకు చక్కటి హాస్టల్ వసతి సౌకర్యం ఉన్నదని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లక్కారం ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ పి.అజరయ్య తెలిపారు.





## ఘనంగా వాసవి మాత జయంతి

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్ :** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవి (కన్యకా పరమేశ్వరీ) మాత జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 7 గంటలకే స్థానిక హనుమాన్ మందిరంలో ఆర్య వైశ్యులు ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వాసవి మాతకు పాలాభిషేకాలు నిర్వహించారు. 9 గంటలకు హనుమాన్ మందిరం నుండి పల్లకిలో వాసవి (కన్యకా పరమేశ్వరి) మాత ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా ఆటపాటలతో భక్తి పరవశంతో మహిళలు నృత్యాలు , భజనలు చేస్తూ ఇంద్రారెడ్డి చౌరస్తా నుండి హనుమాన్ మందిరం వరకు ఊరేగింపు కన్నుల పండుగగా సాగింది. అనంతరం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ప్రకాష్ గుప్త మాట్లాడుతూ...మన హిందూ బంధువులందరూ ఒక తాటిపై నిలవాలని, అందరూ ఐకమత్యంతో ఉండాలని, రాబోవు రోజులలో అత్యంత సుందరంగా అందరి కోరికతో శంకర్ పల్లి లో వాసవి మాత ఆలయాన్ని నిర్మించుకుందామని అన్నారు. పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయిన మన హిందూ బంధువుల ఆత్మ శాంతి కోసం అందరూ ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ కార్యక్రమం శంకర్ పల్లి మున్సిపల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దండుమోహన్, మిరియాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కన్నుల పండుగ సాగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



## కొటాలగూడ ప్రభుత్వ భూములు ఎర్ర మట్టి తవ్వకాలు

### పట్టించుకునే నాథుడే లేడా అంటున్న గ్రామస్తుల ఆరోపణ

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ మండల పరిధిలోని కొటాలగూడ గ్రామపంచాయతీ పరిధికి చెందిన ప్రభుత్వ భూమిలో జోరుగా ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్న ఏ ఒక్క అధికారి కూడా ఉంచుకున్న దాఖలాలు లేవని కొటాలగూడ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి తేడా లేకుండా అక్రమంగా మట్టి రవాణా జరిపిస్తున్న సంబంధిత అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎర్రమట్టి దళారులు ఒక టిప్పర్ ధర 6000 నుండి 8000 వరకు సొమ్ము చేసుకోవడం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎర్రమట్టి తవ్వకాలు జరిపి మట్టిని కాజేస్తున్న దళారులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

## వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి చౌరస్తాలో

# అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ

### ముఖ్య అతిథిగా పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** దేశంలోని కోట్లాది మంది దళిత, గిరిజన, బహుజనులు తలేత్తుకుని బ్రతుకుతున్నారంటే ఆ దైర్యం పేరే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఎన్నెపల్లి చౌరస్తాలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, శాసన సభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, బి.మనోహర్ రెడ్డి, కాలే యాదయ్య లతో కలిసి భారత రత్న, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీంరావ్ అంబేద్కర్ 12 అడుగుల భారీ విగ్రహాన్ని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...అంబేద్కర్ ఒక చరిత్ర నేటి వాస్తవానికి ప్రతీక అన్నారు. విద్యా, ఉద్యోగాలు దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు భారతరత్న డాక్టర్ భీం రావు అంబెద్కర్ అన్నారు. వికారాబాద్ పట్టణ ముఖద్వారం ఎన్నేపల్లి చౌరస్తాలో బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా మన వికారాబాద్ కు ఒక గౌరవం లభించిందని ఆయన పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని, ఎస్సీ ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్ లో 40 వేల 232 కోట్ల రూపాయలను కేటాయించిందని తెలిపారు. దళిత, గిరిజన, బీసీ బిడ్డలకు సంబంధించిన సంక్షేమ హాస్టల్ లో గతంలో ఎప్పుడూ లేని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 200 శాతం కాస్మొటిక్, 40 శాతం మెస్ చార్జీలను పెంచిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని దీనితో పేద దళిత, గిరిజన, బీసీ వర్గాల పిల్లలకు న్యాయం జరుగుతుందని ఆయన చెప్పారు. అంబేద్కర్ ఈ దేశ దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు ఒక కాగడా లాగా వెలుగును పంచుతున్నారని, ఆ వెలుగులో మనం విజయం అనే గమ్యాన్ని అందుకోవాలని అప్పుడే అంబేద్కర్ నిజమైన నివాళులర్పించిన వారమవుతామని స్పీకర్ పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి దిక్సూచి చూపిన మహానుభావుడు బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నారు. అన్ని రంగాల్లో ప్రావిణ్యం కలిగి ఉండడం వల్లనే దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగ రచనకు ఆయన సేవలు తీసుకోవడం జరిగిందనీ తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ ను యువత స్ఫూర్తిగా తీసుకొని, వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు తన జీవితకాలం పోరాడిన మహా వ్యక్తి బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ వారసులుగా తమ జీవిత శైలిని మార్చుకుంటూ హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు బాగుండాలనే వారి ఆకాంక్షను నెరవేర్చాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బాబా సాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన అనంతరం ఏపూరి సోమన్న బృందం ఆలపించిన సామాజిక స్పృహ, ఓటు హక్కు, అక్షరమే ఆయుధంగా మలుచుకొని ఆశయ సాధనకు ముందుకు వెళ్లాలి అనే పాటలు ఆహుతులను ఎంతగానో ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్, ఆర్థిక కమిటీ సభ్యులు రమేష్ మహారాజ్, డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టిఏ మెంబర్ జాఫర్, దిశ కమిటీ సభ్యులు వడ్ల నందు, విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.









## 'ఆపరేషన్ సింధూర్' సూపర్ సక్సెస్

### మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి



- అన్నోజిగూడ ఫ్లై ఓవర్ వద్ద భారత జవానులకు మద్దతుగా బాణాసంచా పేల్చుతూ సంబురాలు
- ఉగ్రవాద శాశ్వత నిర్మూలన మన లక్ష్యం



**పోచారం, రాజముద్ర న్యూస్:** జమ్మూ కాశ్మీర్ పహల్గం ఉగ్రదాడిని తిప్పికొడుతూ భారత సైన్యం ఉగ్రవాద స్థావరాలపై చేసిన "ఆపరేషన్ సింధూర్" సూపర్ సక్సెస్ అని పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం అన్నోజిగూడ ఫ్లైఓవర్ వద్ద మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో భారత జవాన్లకు మద్దతుగా బాణాసంచా పేల్చుతూ జయహో భారత్... భారత్ మాతాకీ జై అని నినాదాలు చేస్తూ సంబురాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ... ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిర్మూలించేందుకు భారత ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని, భారత సైన్యం యొక్క వీర, పరాక్రమాలకు ఇది నాంది అని, సుమారు 25 మంది హిందువులను లక్ష్యంగా విచక్షణారహితంగా చంపిన ఉగ్రవాదులకు, దాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కు భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ ద్వారా 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి భారత దెబ్బను పాకిస్తాన్ కి రుచి చూపించిందని, సామాన్య ప్రజలకు ఎలాంటి నష్టం లేకుండా మొన్న సైన్యం చేసిన ఈ ఆపరేషన్ విశ్వవ్యాప్తంగా భారత్ గొప్పతనాన్ని ఔన్నత్యాన్ని మరోసారి చాటి చెప్పిందని, ఇదే స్ఫూర్తితో ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిర్మూలించేందుకు మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలని యావత్ భారత ప్రజలు ఒక్కటై భారత సైన్యానికి, భారత ప్రభుత్వానికి అండదండగా ఉంటారని, భవిష్యత్తులో ఉగ్రవాదం అనే ఊసే లేకుండా చేసే విధంగా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా ప్రతి భారతీయుడు అప్రమత్తంగా ఉంటూ, మన భారత సైన్యానికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేస్తూ.. ఉగ్రదాడిలో బలైన అమరులకు మరోసారి నివాళులర్పిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, జితేందర్ నాయక్, కే ఎం రెడ్డి, జంగయ్య యాదవ్ జవాజీ అశోక్, అంజాద్ ఖాన్, రాజేశ్వర్ రెడ్డి, నల్లవెల్లి మురళి, రఘురామ్ రెడ్డి, బాలగోని శ్రీధర్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, కొమ్ముల ప్రశాంత్, చాంద్, ఇస్లావత్ రవి నాయక్, రాము నాయక్, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## "ఆపరేషన్ సింధూర్"చారిత్రాత్మక నిర్ణయం

### కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి

- ఉగ్రవాద శాశ్వత నిర్మూలన మన లక్ష్యం
- భారత సైన్యానికి, సైన్యాధికారులకు కృతజ్ఞతలు



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్ :** జమ్మూ కాశ్మీర్ పహల్గం ఉగ్రదాడిని తిప్పికొడుతూ భారత సైన్యం ఉగ్రవాద స్థావరాలపై చేసిన "ఆపరేషన్ సింధూర్" సూపర్ సక్సెస్ అని పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి అన్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ... ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిర్మూలించేందుకు భారత ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని, భారత సైన్యం యొక్క వీర, పరాక్రమాలకు ఇది నాంది అని, సుమారు 25 మంది హిందువులను లక్ష్యంగా విచక్షణారహితంగా చంపిన ఉగ్రవాదులకు, దాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కు భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ ద్వారా 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి భారత దెబ్బను పాకిస్తాన్ కి రుచి చూపించిందని, సామాన్య ప్రజలకు ఎలాంటి నష్టం లేకుండా మొన్న సైన్యం చేసిన ఈ ఆపరేషన్ విశ్వవ్యాప్తంగా భారత్ గొప్పతనాన్ని ఔన్నత్యాన్ని మరోసారి చాటి చెప్పిందని, ఇదే స్ఫూర్తితో ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిర్మూలించేందుకు మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలని యావత్ భారత ప్రజలు ఒక్కటై భారత సైన్యానికి, భారత ప్రభుత్వానికి అండదండగా ఉంటారని, భవిష్యత్తులో ఉగ్రవాదం అనే ఊసే లేకుండా చేసే విధంగా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తుంగతుర్తి రవి అన్నారు. అదేవిధంగా ప్రతి భారతీయుడు అప్రమత్తంగా ఉంటూ, మన భారత సైన్యానికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేస్తూ.. ఉగ్రదాడిలో బలైన అమరులకు మరోసారి నివాళులర్పిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు.

# అభివృద్ధిలో దూసుకెళ్తున్న బోడుప్పల్ కార్పొరేషన్

- మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కృషి ఫలితం ప్రధాన రోడ్లకు మహర్దశ.
- హెచ్ఎండిఏ నుండి 33 కోట్ల నిధుల విడుదల.
- ప్రధాన రోడ్లను పరిశీలించిన ఎచ్ఎండిఏ, మున్సిపల్ అధికారులు, నాయకులు





**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** అభివృద్ధిలో భాగంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కృషి ఫలితంగా ప్రధాన రహదారుల అభివృద్ధికి మోక్షం కలిగింది. బోడుప్పల్ నగర పరిధిలోని ప్రధాన రోడ్లను సుందరీకరణ చేయడానికి హెచ్ఎండిఏ అధికారులు సంసిద్ధమైయ్యారు. హెచ్ఎండిఏ నుండి రూ. 33 కోట్ల నిధులను విడుదల చేశారు. వరంగల్ జాతీయ రహదారి నుండి బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం వరకు గల ప్రధాన రహదారి వెడల్పు, బీటీ రోడ్డు కొరకు రూ. 4కోట్ల 70లక్షలు. మున్సిపల్ కార్యాలయం నుండి చెంగిచెర్ల చింతల చెరువు వరకు రహదారి వెడల్పు, బీటీ రోడ్డు కొరకు రూ. 14కోట్ల 60లక్షలు. అంబేద్కర్ విగ్రహం నుండి చిలుకానగర్ వరకు రహదారి వెడల్పు, బీటీ రోడ్డు కొరకు రూ. 10కోట్ల 45లక్షలు. మల్లిఖార్జున స్వామి దేవాలయం నుండి మల్లాపూర్ రహదారి వెడల్పు బీటీ రోడ్డు కొరకు రూ. 4కోట్ల 70లక్షల పనులకు మోక్షం లభించింది. బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ లోని ప్రధాన రహదారులను హెచ్ఎండిఏ ఈఈ శ్రీనివాస్, హెచ్ఎండిఏ ఏఈ విశ్వతేజ, బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ శైలజ, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తో కలిసి పరిశీలించారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ నగర డీఈఈ చిరంజీవి, ఏఈ, మాజీ కార్పోరేటర్లు కొత్త చందర్ గౌడ్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, భూక్య సుమన్ నాయక్, చీరాల నర్సింహ్మా, నాయకులు పులకండ్ల జంగారెడ్డి, పాల్గోన్నారు.



# అప్పుడు బాలాకోట్..
# ఇప్పుడు ఆపరేషన్ సిందూర్



## ఆపరేషన్ సిందూర్..
### యూపీలో రెడ్ అలర్ట్

**శ్రీనగర్:** పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి భారత్ గట్టిగా ప్రతీకారం తీర్చుకుంది. పాకిస్థాన్ భూభాగంలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' విజయవంతగా నిర్వహించినట్లు సైన్యం ప్రకటించింది. ఈ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను భారత ఆర్మీ మరికొద్ది సేపట్లో వెల్లడించనుంది. ఈ నేపథ్యంలో దేశంలోని పలు ముఖ్య నగరాల్లో భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. పంజాబ్, రాజస్థాన్‌లో హై అలర్ట్ ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రెడ్ అలర్ట్ జారీ చేసింది. పోలీసులు రక్షణశాఖ వర్గాలతో సమన్వయం చేసుకొని ముందుకుసాగాలని, ప్రజలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని ఆ రాష్ట్ర డీజీపీ సూచించారు. మరోవైపు ఉగ్రదాడులు జరిగినప్పుడు ఎలా స్పందించాలనే విషయంపై నేడు దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహించనున్న సంగతి తెలిసిందే.

**ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం: జమ్మూకశ్మీర్ ఎల్జీ**

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రకటించారు. సరిహద్దు జిల్లాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని.. సరిహద్దు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు, బంకర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వారికి అవసరమైన ఆహారం, రవాణా సదుపాయాలు కల్పించాలని సూచించారు. జమ్మూలోని భారత సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించాలని..పౌరుల ప్రాణాలను కాపాడటానికి ప్రాధాన్యం ఇవ్వాలని భద్రతా బలగాలకు సూచించారు. కశ్మీర్‌లో పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. ఒమర్ అబ్దుల్లాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అన్ని భద్రతా చర్యలు కల్పించాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు.

**జమ్మూకశ్మీర్‌లోని ఐక్యరాజ్యసమితి ఆస్తులను లక్ష్యంగా చేసుకున్న పాక్**

'ఆపరేషన్ సిందూర్'తో భారత సైన్యం ఇప్పటికే దాదాపు 80 మందికి పైగా ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుబెట్టినట్లు తెలుస్తోంది. ఈ దాడితో అనుకోని దెబ్బతిన్న పాక్ సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంట విచక్షణారహితంగా కాల్పులకు తెగబడింది. ఈ ఘటనలో పది మంది భారత పౌరులు మృతి చెందగా.. పలువురు గాయపడినట్లు భారత ఆర్మీ వెల్లడించింది. కశ్మీర్ సరిహద్దుల్లో పాక్ ప్రయోగించిన ఫిరంగి గుండ్లు ఐక్యరాజ్యసమితి ఫీల్డ్ స్టేషన్ వైపు దూసుకొచ్చినట్లు భారత సైన్యం వెల్లడించింది. పూంఛ్‌లో గేటు వెలుపల అవి పడిపోయినట్లు తెలిపింది.

## ప్రధాని మోదీ విదేశీ పర్యటనలు రద్దు



**న్యూఢిల్లీ :** 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భారత సైన్యం మెరుపుదాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ పలు దేశాల పర్యటనలను రద్దు చేసుకున్నారు. ఈనెల మధ్యలో యూరప్, క్రొయేషియా, నార్వే, నెదర్లాండ్స్ దేశాల్లో మోదీ పర్యటించాల్సి ఉంది. అయితే, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్- పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలోనే ఆయన తన పర్యటనలు రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక, రష్యా నిర్వహించనున్న విక్టరీ డే వేడుకల్లోనూ మోదీ పాల్గొనడం లేదని ఇటీవల క్రెమ్లిన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. గత నెలలో పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 26 మంది ప్రాణాలు తీశారు. దీనికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై ఒత్తిడి తెచ్చేలా భారత్ చర్యలు ప్రారంభించింది. ఈక్రమంలో భారత సైన్యం పాక్‌లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. మొత్తం 9 ఉగ్ర స్థావరాలపై దాడులు చేయగా దాదాపు 80 మందికి పైగా ఉగ్రవాదులు మృతి చెందినట్లు తెలుస్తోంది.




## మే 10 వరకు 165 విమాన సర్వీసుల రద్దు


**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడికి భారత్ గట్టిగా ప్రతీకారం తీర్చుకుంది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్, పీఓకేలోని 9 ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులకు పాల్పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత గగనతలంలో కొంత మేర కేంద్రం ఆంక్షలు విధించింది. దీంతో ఇప్పటికే అనేక విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ క్రమంలోనే ప్రముఖ విమానాయాన సంస్థ ఇండిగో కీలక ప్రకటన చేసింది. మే 10వ తేదీ వరకు 165కు పైగా విమానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది."గగనతలంపై ఆంక్షల నేపథ్యంలో అమృత్‌సర్, బికనేర్, చండీగఢ్, ధర్మశాల, గ్వాలియర్, జమ్మూ, జోధ్‌పుర్, కిషన్‌గఢ్, లేహ్, రాజ్‌కోట్, శ్రీనగర్ సహా పలు ఎయిర్‌పోర్టుల నుంచి మే 10వ తేదీ ఉదయం 5.30 గంటల వరకు 165కి పైగా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నాం" అని ఇండిగో ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రయాణికులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లను చూసుకోవాలని తెలిపింది. ఆయా విమాన ప్రయాణికులు రీషెడ్యూల్ లేదా టికెట్ క్యాన్సిల్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఇందుకు ఎలాంటి అదనపు ఛార్జీలు లేవని, క్యాన్సిల్ చేసుకుంటే పూర్తి రీఫండ్ కూడా ఇస్తామని పేర్కొంది. అటు ఎయిర్‌ఇండియా కూడా ఇదే విధమైన ప్రకటన చేసింది. మే 10వ తేదీ ఉదయం వరకు శ్రీనగర్, జమ్మూ, లేహ్, జోధ్‌పుర్, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, రాజ్‌కోట్, చండీగఢ్ ఎయిర్‌పోర్టులకు తమ విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ప్రయాణికులకు వన్‌టైమ్ రీషెడ్యూల్ ఛార్జీల మినహాయింపు కల్పించింది. లేదా పూర్తి రీఫండ్ ఇస్తామని తెలిపింది. స్పైస్‌జెట్, ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్ విమనాలు కూడా రద్దయ్యాయి. మరోవైపు, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో బుధవారం ఉదయం నుంచి దేశవ్యాప్తంగా 18 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. శ్రీనగర్, లేహ్, అమృత్‌సర్, చండీగఢ్ సహా పలు ఎయిర్‌పోర్టుల్లో రాకపోకలు నిలిచిపోయాయి.

### పాక్‌ను ఏమార్చి దెబ్బకొట్టిన భారత్

**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్ర దాడికి భారత్ ప్రతీకార చర్యలు చేపట్టింది. 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులు చేసింది. ఈ చర్యపై యావత్ భారతదేశం హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తోంది. దాయాదిని ఏమార్చి.. అత్యంత పకడ్బంధీగా దాడుల ప్రణాళికలను భారత్ అమలుచేసింది. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ వ్యూహాలు కీలకంగా నిలిచాయి. బాలాకోట్ దాడులకు ముందు కూడా ఇలాంటి వ్యూహాలనే ప్రధాని అమలుచేశారు. దాడులకు ముందు ప్రశాంతమైన ప్రవర్తనతో దాయాదిని మరోసారి ఏమార్చారు. ఈ దాడులతో పాక్ షాక్‌కు గురికాక తప్పలేదు. బాలాకోట్ దాడి, ఆపరేషన్ సిందూర్‌ల మధ్య ఎన్నో పోలికలు ఉన్నాయి. అయితే.. వీటిని దాయాది పాకిస్థాన్ పసిగట్టడంలో విఫలమైంది. మోదీ వ్యూహాలను అంచనా వేయడంలో వెనకబడింది. పాక్ దృష్టి మరల్చి దెబ్బకొట్టడంలో భారత ప్రధాని మోదీ మరోసారి పైచేయి సాధించారు. దీంతో దాయాది ఏమరపాటుగా ఉన్న వేళ ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది.

**బాలాకోట్ దాడులకు ముందు..**

పుల్వామా ఉగ్ర దాడికి ప్రతీకారంగా 2019 ఫిబ్రవరి 26న బాలాకోట్‌పై భారత్ దాడులు చేసింది. ఆ దాడికి 48 గంటల ముందు ప్రధాని మోదీ ఎప్పటిలానే ఎంతో ప్రశాంతంగా తన పనుల్లో నిమగ్నమయ్యారు. ఫిబ్రవరి 25న ఆయన దిల్లీలో జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్ని జాతికి అంకితం చేశారు. భారత సాయుధ దళాల పరాక్రమం గురించి మాట్లాడినప్పటికీ.. పాకిస్థాన్‌లోని ఖైబర్‌పంఖ్తుంఖ్వాలోని ఉగ్ర స్థావరాలపై జరగబోయే దాడుల గురించి ఎలాంటి సూచనలు చేయలేదు. ఆ రోజు రాత్రి 9 గంటలకు భారత వాయుసేన దాడులకు సిద్ధమవుతుండగా.. ప్రధాని మోదీ దిల్లీలో ఓ మీడియా బృందం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. అభివృద్ధి, భారత ఆకాంక్షలు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత సంకల్పం గురించి మాట్లాడారు. అయితే ఆ సమయంలో ప్రధాని ముఖంలో ఎలాంటి ఆందోళనా లేదు. ఎంతో ప్రశాంతంగా కనిపించారు. ఆ తర్వాత భారత బలగాలు తాము



చేయాల్సిన పనిని విజయవంతంగా ముగించాయి.

**ఇప్పుడూ అలానే..**

బాలాకోట్ దాడికి ముందు ప్రధాని మోదీ ప్రవర్తన ఎలా ఉందో.. ఇప్పుడూ అలానే ఎంతో ప్రశాంతంగా కనిపించారు. అప్పుడు పాల్గొన్నట్లే.. దాడికి ఒక రోజు ముందు ఓ మీడియా సంస్థ నిర్వహించిన సమావేశంలో మోదీ పాల్గొన్నారు. మంగళవారం రాత్రి ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'ఇండియా ఎట్ 2047' సదస్సులో మోదీ మాట్లాడారు. భారత జలాలను ఇక నుంచి దేశం దాటనివ్వబోమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాల కోసమే వాటిని వినియోగిస్తామని తేల్చి చెప్పారు. దాదాపు 30 నిమిషాల పాటు సాగిన ప్రసంగంలో.. ప్రధాని ముఖంలో ఎక్కడా ఆందోళన కనిపించలేదు. మరోవైపు దేశవ్యాప్తంగా యుద్ధ సన్నద్ధతపై ప్రజలకు అవగాహన కల్పించే మాక్ డ్రిల్స్‌ను అంతకుముందు ప్రకటించారు. ఇలాంటి కార్యక్రమాలతో.. దేశ ప్రజలను సైనిక చర్యకు, దాని పరిణామాలకు మోదీ సిద్ధం చేస్తున్నారనే సూచనలు మాత్రమే ప్రత్యర్థుల్లోకి వెళ్లాయి. అయితే.. ఇవన్నీ దాయాదిని ఏమార్చడానికి ఒక వ్యూహం మాత్రమే అని నిపుణులు పేర్కొంటున్నారు. వీటిని పసిగట్టడంలో.. అప్పుడు బాలాకోట్ దాడుల సమయంలోనూ.. ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ పాకిస్థాన్ పూర్తిగా విఫలమైంది. దీంతో దాయాది దృష్టి మరల్చి దాడి చేయడంలో మరోసారి భారత బలగాలు పైచేయి సాధించాయి.

## పాక్‌లోని తమ పౌరులకు అమెరికా అడ్వైజరీ

**న్యూయార్క్:** 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ దాడులు చేపట్టిన నేపథ్యంలో అక్కడ ఉన్న తమ పౌరులకు అమెరికా రాయబార కార్యాలయం పలు హెచ్చరికలు జారీ చేసింది. సాయుధ దళాల సంఘర్షణకు అవకాశం ఉన్నందున భారత్-పాక్ నియంత్రణ రేఖకు సమీపంలో ఉన్న ప్రాంతాలకు ప్రయాణాలు చేయొద్దని సూచించింది. ఇరుదేశాల గగనతలాల మూసివేత, పాక్‌లోని పరిస్థితిని ఎప్పటికప్పుడు తాము నిశితంగా గమనిస్తున్నామని వెల్లడించింది. పాక్‌లో దాడులు జరిగిన ప్రాంతాలకు సమీపంగా ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లి ఆశ్రయం పొందాలని.. అమెరికా అడ్వైజరీ సూచించింది. ఆయా ప్రాంతాలకు వెళ్లాలనుకునేవారు తమ ప్రయాణాలను రద్దు చేసుకోవాలని సూచించింది. కాగా పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడుల విషయంపై అమెరికా ఇప్పటికే స్పందించింది. ఈ ఘర్షణకు వీలైనంత త్వరగా ముగింపు పలకాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. రెండు శక్తిమంతమైన దేశాల మధ్య యుద్ధం ఎవరూ కోరుకోరని.. భారత్, పాక్‌లకు ఎంతో చరిత్ర ఉందని అన్నారు. వీటి మధ్య ఎన్నో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ.. ప్రపంచానికి శాంతి మాత్రమే కావాలని, ఘర్షణలు వద్దని



అన్నారు. యూఎస్‌లోని భారత రాయబార కార్యాలయం మాట్లాడుతూ.."ఆధారాలు, సాంకేతిక సమాచారం, అక్కడి నుంచి ప్రాణాలతో బయటపడిన వారి సాక్ష్యం ఆధారంగా భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులకు పాల్పడినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. ఈ దాడిలో అక్కడి పౌర, ఆర్థిక, సైనిక లక్ష్యాల జోలికి భారత్ వెళ్లలేదు. కేవలం ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా దాడులు జరిగాయి" అని పేర్కొంది. మరోవైపు ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత రాయబారికి పాక్ సమన్లు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## భారత్ గతంలో ఎన్నడూ చేయనట్లు.. 'ఆపరేషన్ సిందూర్'

**న్యూఢిల్లీ :** భారత్ గతంలో జరిపిన మెరుపుదాడుల కంటే తాజాగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' పూర్తిగా భిన్నమైనది. 2016లో ఉరి ఉదంతర తరువాత నిర్వహించిన మెరుపు దాడులు, 2019లో బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్స్ సహా గతంలో ఎన్నడూ ఇటువంటి దాడులు చేపట్టలేదు. సాంకేతికపరంగా ఈ ఆపరేషన్ అత్యంత బలమైంది.. ఖర్చుతో కూడుకొన్నది. అంతేకాదు.. ఉగ్రవాదం విషయంలో గతంలో అనుసరించిన వైఖరి పూర్తిగా మారిపోయిందనే బలమైన సంకేతం పాక్‌కు వెళ్లింది. "భారీ సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో.. టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌లు, వాటి హ్యాండిలర్లకు తీవ్ర హెచ్చరికలు వెళ్లినట్లైంది. దీంతోపాటు భారత్ అవసరమైతే ముందస్తుగా దాడి చేయగలదని.. పాక్‌లోని ఏ లక్ష్యం తమకు దూరం కాదని చెప్పినట్లైంది. దీంతోపాటు ఉగ్రదాడులకు ప్రతిస్పందించడమంటే కేవలం శక్తినే చూపమని.. టెర్రరిస్టుల కార్యకలాపాలు, ఇతర వనరుల పునాదులను పెకలించేస్తామని ఈ దాడులతో పేర్కొంది. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించే 24 ఆయుధాలను భారత్ వినియోగించింది. వీటిల్లో క్షిపణులు, బాంబులు, ఆత్మాహుతి డ్రోన్లు ఉన్నాయి. మొత్తం తొమ్మిది ఉగ్రక్యాంప్‌లను ఏకకాలంలో ధ్వంసం చేశాయి. దాదాపు 70 మందికిపైగా ఉగ్రవాదులు మరణించారు. మరో 60 మంది వరకు గాయపడ్డారు. ఈ దాడి కోసం భారత్ ఇంటెలిజెన్స్ అధికారులు ఉపగ్రహ చిత్రాలను, హ్యూమన్ ఇంటెలిజెన్స్, ఉగ్ర కమ్యూనికేషన్లను విశ్లేషించి.. జైషే మహమ్మద్, లష్కరే వినియోగించే కాంప్లెక్స్‌ను గుర్తించారు. వీటితోపాటు ఆ ఉగ్ర



సంస్థల ఆయుధ డిపోలను, బ్రెయిన్ వాషింగ్, స్లీపర్ సెల్ ప్లానింగ్ కేంద్రాలను నిర్ధరించుకొన్నారు. ఇక సరిహద్దులకు అత్యంత సమీపంలో ఉన్న స్థావరాలపై మానవ రహిత విమానాలతో కొన్ని రోజులుగా నిఘా ఉంచారు. ఆయుధాల ఎంపికలో కూడా అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలు ఛేదించేవాటినే ఎంచుకొన్నారు. స్కాల్ప్ క్రూజ్ మిసైల్, హ్యామర్ గైడెడ్ బాంబులు, ఆత్మాహుతి డ్రోన్లను ఎంచుకొన్నారు. దాదాపు 25 నిమిషాలపాటు జరిగిన ఈ ఆపరేషన్‌లో అంతర్జాతీయ సరిహద్దులకు దాదాపు 100 కిలోమీటర్ల దూరంలోని బవహల్పూర్ జైషే క్యాంప్ సహా పలు స్థావరాలను నేల మట్టం చేసింది. ఇక్కడ పాక్ ఆర్మీ రెజిమెంటల్ సెంటర్ కూడా ఉంది. పాకిస్థాన్‌లో అత్యంత శక్తిమంతమైన పంజాబ్ ప్రావిన్స్‌లోనే నాలుగు టెర్రర్ క్యాంప్‌లను నేలమట్టం చేశారు.

## ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం భారత్‌కు లేదు.. కానీ: అజిత్ డొభాల్

**న్యూఢిల్లీ :** 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం దాడులు జరిపిన విషయం గురించి భారత జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ ఇతర దేశాలకు వెల్లడిస్తూ..వారి మద్దతు కూడగడుతున్నారు. ఇందులో భాగంగా ఆయన చైనా సహా... అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ దేశాల భద్రతా సలహాదారులు, కార్యదర్శులతో మంతనాలు జరిపారు. ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం భారత్‌కు లేదని, కానీ వాటిని ఎక్కువ చేయాలని పాక్ నిర్ణయించుకుంటే మాత్రం ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధమని డోభాల్ వారికి స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై తీసుకున్న చర్యలు..ఆపరేషన్ నిర్వహించడానికి గల కారణాలను ఆయన వారికి వివరించినట్లు అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అక్కడి ఉగ్రవాదుల శిబిరాలపై దాడుల అమలు వివరాలు వారికి చెప్పినట్లు సమాచారం. భారత మిత్రదేశాలతో భవిష్యత్తులోనూ సమాచారం పంచుకుంటామని అన్నారు. ఇప్పటి వరకు ఆయన 8 దేశాల ప్రతినిధులతోనూ చర్చలు జరిపారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. పాక్‌లోని 4, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 స్థావరాలపై దాడులు చేసింది. అంతర్జాతీయ సరిహద్దుకు 30 కి.మీ. దూరంలో ఉన్న లష్కరే తోయిబాకు చెందిన గుల్పూర్ టెర్రర్ క్యాంప్ సహా 9 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని.. భద్రతా బలగాలు క్షిపణులు ప్రయోగించాయి. రాజౌరి - పూంచ్ ప్రాంతాల్లో ఇందులోని ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారు. ఇక్కడే 2023, 2024లో పూంచ్ దాడుల్లో కీలకంగా వ్యవహరించిన ఉగ్రవాదులు ట్రైనింగ్ పొందినట్లు తమకు సమాచారం ఉన్నట్లు భారత అధికారులు పేర్కొన్నారు.



## సినిమా అప్పుడే అయిపోలేదు..
### ఆర్మీ మాజీ చీఫ్‌ల కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా.. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్ర స్థావరాలపై దాడిని ఉద్దేశిస్తూ.. 'సినిమా అప్పుడే అయిపోలేదు.. ఇంకా ఉంది' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మరోవైపు మాజీ చీఫ్‌ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ శంకర్ రాయ్ చౌదరి మాట్లాడుతూ.. ఉగ్రస్థావరాలపై భారత బలగాలు చేసిన దాడిని అద్భుతమైన ప్రణాళికతో కూడిన గొప్ప ఆపరేషన్‌గా ప్రశంసించారు. ఈ దాడులను భారత్ ఆపకూడ దని.. కొనసాగించాలని సూచించారు. ఇది యుద్ధం లాంటి పరిస్థితి కాదని.. ఇప్పటికే ఇరుదేశాల మధ్య అప్రకటిత యుద్ధం కొనసాగుతోందని అన్నారు. దాడుల సమయంలో మాజీ ఆర్మీ చీఫ్‌ల నుంచి ఈతరహా స్పందన రావడం గమనార్హం. పాకిస్థాన్, పీఓకేలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారత్ పెద్దఎత్తున విరుచుకుపడింది. భారత్‌పై సీమాంతర ఉగ్రదాడులకు కుట్ర పన్నినట్లు భావిస్తున్న మొత్తం తొమ్మిది స్థావరాలపై ఆర్మీ దాడులు చేపట్టి.. 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంగా నిర్వహించినట్లు సైన్యం ప్రకటించింది. ఈ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను కేంద్ర రక్షణ, విదేశాంగ శాఖ మీడియాకు వెల్లడించింది. భారత ప్రభుత్వం ప్రకటన అనంతరం ఇండియన్ ఆర్మీ స్పందించింది. 'న్యాయం జరిగింది' అని ఎక్స్‌లో పోస్టు చేసింది. తాజాగా ఈ విషయంపై కేంద్రం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ విలేకరులతో మాట్లాడారు. కోట్లీలోని గుల్పూర్ టెర్రర్ క్యాంప్‌పై ఎలా దాడి చేశామనేది సోఫియా ఖురేషి వీడియో ప్రదర్శించారు. ఇక్కడే గతంలో 'పూంచ్' దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు శిక్షణ తీసుకున్నారంటూ పేర్కొన్నారు. ఈ దాడులకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## మసూద్ అజార్ కుటుంబంలో
## 10 మంది హతం



పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంతో రగిలిపోయిన భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలపై బాంబుల వర్షం కురిపించింది. ముఖ్యంగా జైషే మహ్మద్, లష్కరే తోయిబా ప్రధాన స్థావరాలను లక్ష్యంగా చేసుకొని వాటిని నేల మట్టం చేసింది. విజయవంతంగా జరిపిన ఈ 'ఆపరేషన్ సిందూర్'లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు తెలుస్తోంది. జైషే ముఠాకు చెందిన ఓ స్థావరంపై జరిగిన దాడిలో 14 మంది మృతిచెందినట్లు సమాచారం. ఇందులో 10 మంది మసూద్ కుటుంబసభ్యులేనని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. మసూద్ అజార్ సోదరి-ఆమె భర్త, మసూద్ మేనల్లుడు-అతడి భార్య, మేనకోడలు, ఐదుగురు చిన్నారులు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈమేరకు జైషే వర్గాలను ఉటంకిస్తూ ఆ కథనాలు పేర్కొన్నాయి. వీరితో పాటు అజార్ అత్యంత సన్నిహితులు నలుగురు మరణించినట్లు సమాచారం. అయితే, దీనిపై అధికారిక ప్రకటనేదీ లేదు. భారత్ జరిపిన దాడుల్లో జైషే ప్రధాన కేంద్రం కూడా ఉంది. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్‌పై భారత సైన్యం దాడి చేసింది. దీన్ని జైషే మహ్మద్‌కు ఆపరేషనల్ హెడ్‌క్వార్టర్‌గా అభివర్ణిస్తారు. పుల్వామా దాడి సహా భారత్‌పై చాలా కుట్రలకు ఇక్కడే పథక రచన చేశారు. మసూద్ తన ఇంటిగా కూడా వినియోగిస్తాడు. ప్రస్తుతం జైషే నెంబర్-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబసభ్యులు కూడా దీనిలోనే ఉంటున్నట్లు సమాచారం. దాదాపు 600 మంది ఉగ్రవాదుల ఇళ్లు కూడా ఈ క్యాంపస్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది.



## ఆపరేషన్ సిందూర్ తర్వాత జైషే స్థావరం ఇలా.

**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడికి భారత్ బదులు తీర్చుకుంది. లష్కరే తోయిబా, జైషే ఉగ్రముఠాలే లక్ష్యంగా వాటి స్థావరాలపై బాంబులతో విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో జరిపిన మెరుపుదాడులతో ఈ ఉగ్రసంస్థలకు గట్టి దెబ్బ తగిలింది. ముఖ్యంగా బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రంపై దాడిని భారీ విజయంగా చెప్పొచ్చు. దాడుల్లో ఈ స్థావరం ధ్వంసమైంది. అందుకు సంబంధించిన దృశ్యాలను భాజపా ఐటీ విభాగం ఇన్‌ఛార్జ్ అమిత్ మాలవీయ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. "పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని బహవల్‌పూర్‌లో గల మర్కజ్ సుబాన్.. జైషే ముఠా హెడ్‌క్వార్టర్. ఈ ఉగ్రశిబిరంలోనే జైషే అనేక ఉగ్ర కుట్రలకు పథక రచన చేసింది. 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా దాడికి కూడా ఇక్కడే ప్లాన్ చేశారు. ఆ దాడికి పాల్పడిన వారికి ఇక్కడే శిక్షణ అందించారు. ఇప్పుడు ఆ స్థావరాన్ని ధ్వంసం చేశాం" అని మాలవీయ రాసుకొచ్చారు. ఆపరేషన్‌కు ముందు, తర్వాత ఆ ఉగ్ర శిబిరం ఎలా ఉందో వీడియోలో చూడొచ్చు. దాడి కారణంగా భవనం దెబ్బతింది. గోడలు కూలిపోవడంతో పాటు భారీ గొయ్యి ఏర్పడింది. ఇదే స్థావరంలో జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని 10 మందితో పాటు అతడి మరో నలుగురు అనుచరులు మృతిచెందినట్లు వార్తలు వచ్చాయి. ఈ శిబిరాన్ని మసూద్ తన ఇంటిగా కూడా వినియోగిస్తున్నాడు. ప్రస్తుతం జైషే నెంబర్-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబసభ్యులు కూడా దీనిలోనే ఉంటున్నట్లు సమాచారం. దాదాపు 600 మంది ఉగ్రవాదుల ఇళ్లు కూడా ఈ క్యాంపస్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది.

# చెన్నై గెలిచింది

## కోల్‌కతా పరాజయం

**కోల్‌కతా :** చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఓ విజయం. బుధవారం ఆ జట్టు 2 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై నెగ్గింది. మొదట కోల్‌కతా 6 వికెట్లకు 179 పరుగులు చేసింది. రహానె (48బీ 33 బంతుల్లో 4ఐ4, 2ఐ6) టాప్ స్కోరర్. రసెల్ (38బీ 21 బంతుల్లో 4ఐ4, 3ఐ6) మెరిశాడు. నూర్ (4/31), జడేజా (1/34) ఆ జట్టును కట్టడి చేశారు. బ్రెవిస్ (52బీ 25 బంతుల్లో 4ఐ4, 4ఐ6), శివమ్ దూబె (45బీ 40 బంతుల్లో 2ఐ4, 3ఐ6) రాణించడంతో లక్ష్యాన్ని చెన్నై 19.4 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఛేదనలో బ్రెవిస్ ఇన్నింగ్సే హైలైట్. లేదంటే చెన్నై కథ మరోలా ఉండేదే. చెన్నై 5.2 ఓవర్లలో 60 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. ఓపెనర్లు ఆయుష్ మాత్రే, కాన్వే డకౌట్ కాగా.. కొత్త ఆటగాడు ఉర్విల్ పటేల్ (31బీ 11 బంతుల్లో 1ఐ4, 4ఐ6) బ్యాట్ ఝుళిపించినా ఎక్కువ సేపు నిలవలేదు. అశ్విన్ (8), జడేజా (19) కూడా త్వరగానే వెనుదిరిగారు. చెన్నైకి మరో ఓటమి తప్పదనిపించింది. కానీ ఒక్కసారిగా విరుచుకుపడ్డ బ్రెవిస్.. ధనాధన్ షాట్లతో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. నరైన్ బౌలింగ్‌లో కళ్లు చెదిరే సిక్స్ బాదిన అతడు.. 11వ ఓవర్లో దంచి కొట్టాడు. అతడు వరుసగా 6, 4, 4, 6, 6, 4 బాదేయడంతో ఆ ఓవర్లో అరోరా ఏకంగా 30 పరుగులు సమర్పించుకున్నాడు. కానీ తర్వాత స్కోరు వేగం తగ్గింది. 13వ ఓవర్లో బ్రెవిస్ ఔటయ్యాడు. దూబె ధాటిగా ఆడలేకపోయినా.. ధోని (17 నాటౌట్)తో కలిసి స్ట్రైక్ రొటేట్ చేస్తూ జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. ధోని బ్యాట్ ఝుళిపించలేకపోయినా నిలబడ్డాడు. కీలక సమయంలో జోరందుకున్న దూబె.. రాణా వేసిన వేరు వేరు ఓవర్లలో రెండు సిక్స్‌లు కొట్టాడు. ఆఖరి రెండు ఓవర్లలో చెన్నైకి 18 పరుగులు అవసరం కాగా. 19వ ఓవర్లో మూడో బంతికి సిక్స్ కొట్టిన దూబె నాలుగో బంతికి బంతికి ఔటయ్యాడు. ఆ తర్వాతి బంతికి రెండు పరుగులు తీసిన నూర్.. చివరి బంతికి వెనుదిరిగాడు. రెండు వికెట్లు చేతిలో ఉన్న చెన్నైకి చివరి ఓవర్లో 8 పరుగులు అవసరం కావడంతో మ్యాచ్‌లో ఉత్కంఠ పెరిగింది. కానీ రసెల్ బౌలింగ్‌లో మొదటి బంతికే ధోని సిక్స్ కొట్టడంతో చెన్నై ఊపిరిపీల్చుకుంది. నాలుగో బంతికి అన్షుల్ కాంబోజ్ ఫోర్ కొట్టడంతో విజయం సీఎస్కే సొంతమైంది.

**కోల్‌కతా కట్టడి:** ఎడమచేతి వాటం స్పిన్నర్ నూర్ అహ్మద్ విజృంభించడంతో మొదట కోల్‌కతాను చెన్నై కట్టడి చేయగలిగింది. మధ్య ఓవర్లలో చెన్నై స్పిన్నర్లు సూపర్‌గా బౌలింగ్ చేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కోల్‌కతా త్వరగానే గుర్బాజ్ (11) వికెట్‌ను కోల్పోయినా.. రహానె, నరైన్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. రహానె కళ్లు చెదిరే షాట్లతో అలరించాడు. మరోవైపు నుంచి నరైన్ (26బీ 17 బంతుల్లో 4ఐ4, 1ఐ6) కూడా బ్యాట్ ఝుళిపించడంతో 7 ఓవర్లు ముగిసే సరికి కేకేఆర్ 69/1తో భారీ స్కోరుపై కన్నేసింది. కానీ నూర్ ఆ జట్టును దెబ్బతీశాడు. ఒకే ఓవర్లో నరైన్, రఘువంశీ (1)లను ఔట్ చేశాడు. ఆ తర్వాత పరుగుల వేగానికి కళ్లెం పడింది. 9 నుంచి 13వ ఓవర్లో రహానె ఔటయ్యే వరకు కోల్‌కతా 34 పరుగులే వచ్చాయి. 14 ఓవర్లకు స్కోరు 109/4. మనీష్ పాండే (38 నాటౌట్) వేగంగా ఆడలేకపోయాడు. కానీ రసెల్ బ్యాట్ ఝుళిపించాడు. జడేజా బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6 బాదిన అతడు.. పతిరన బౌలింగ్‌లో వరుసగా 6, 4 దంచేశాడు. నూర్ ఓవర్లో ఫోర్, సిక్స్ కొట్టి ఔటయ్యాడు. కేకేఆర్ ఆఖరి 3 ఓవర్లలో 30 పరుగులు రాబట్టింది.








## ఆపరేషన్ సిందూర్..
### ఐపీఎల్ షెడ్యూల్‌పై ప్రభావం చూపనుందా?

పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడిన సంగతి తెలిసిందే. పహల్గాంలో అమాయకులపై దాడి చేసిన పాక్ ఉగ్రదాడికి బదులుగానే భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరిట ఉగ్రవాదులపై కదంతొక్కింది. దీంతో దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురుస్తోంది. పాక్‌కు చావుదెబ్బ తగిలిందని ప్రపంచవ్యాప్తంగా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈక్రమం లో ఐపీఎల్ నిర్వహణపై ఇప్పుడు పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఐపీఎల్ కొనసాగడంపై సందిగ్ధత నెలకొంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఇప్పటికే 56 మ్యాచులు ముగిశాయి. లీగ్ స్టేజ్ లో ఇంకా 14 మ్యాచులు ఉన్నాయి. నాకౌట్, ఫైనల్ కలిపి ఇంకా నాలుగు మ్యాచులు ఆడాల్సిఉంది. మే 25న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఫైనల్ జరగనుంది. ఇప్పుడిప్పుడే ప్లేఆఫ్స్ వేడి రాజుకొంది. టాప్-4 కోసం ఏడు జట్లు పోటీలో నిలిచాయి. ఇలాంటి పరిస్థితుల్లో టోర్నీని వాయిదా వేయాలా? రద్దు చేయాలా? అనేది బీసీసీఐ ముందున్న కఠిన నిర్ణయం. అయితే, తమకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సూచనలు రాలేదని బీసీసీఐ ప్రతినిధులు పేర్కొన్నారు. "బీసీసీఐ నిరంతరం పరిస్థితిని గమనిస్తూనే ఉంది. పరిస్థితులు కఠినంగా మారితే అప్పుడు నిర్ణయం తీసుకుంటాం. ఇప్పటివరకైతే షెడ్యూల్ పరంగానే కొనసాగుతుంది" అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

### అప్పుడే నిర్ణయం: అరుణ్ ధుమాల్

కేంద్రం ఇచ్చే మార్గదర్శకాలను బట్టే తమ నిర్ణయం ఉంటుందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ స్పష్టంచేశారు. అందుకు తగినట్లుగా సిద్ధంగా ఉంటామని తెలిపారు. "ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ గమనిస్తూనే ఉంది. ఈక్రమంలో చాలా విషయాలు ప్రచారమవుతున్నాయి. మేం ఇప్పటివరకు దాని గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దేశం కోసం మేమంతా మద్దతుగా ఉంటాం. అప్పుడు ఐపీఎల్‌పై ఓ నిర్ణయానికి వస్తాం" అని ధుమాల్ తెలిపారు.

### ఆ భయం అక్కర్లేదు!

సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో విదేశీ క్రికెట్ బోర్డులు వేరే దేశమైతే వెంటనే తమ క్రికెటర్లను వెనక్కి పిలిపించేవి. కానీ, భారత్‌లో కాబట్టి భద్రతాపరంగా ఇబ్బంది ఉండదని వారికీ తెలుసునని క్రికెట్ పండితులు అంచనా వేశారు. ఈవిషయంపై దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ స్పందించారు. ఇప్పటివరకు విదేశీ క్రికెటర్లు ఎవరూ తమ భద్రతపై ఆందోళన చెందలేదని పేర్కొన్నారు. "నా వరకైతే ఇలాంటి సమాచారమే రాలేదు. వారికీ తెలుసు భారత్ చాలా సురక్షితమైన ప్రాంతమని. కాబట్టి ఎలాంటి ఆం దోళన అక్కర్లేదు. భారత సైన్యంపై పూర్తి నమ్మకం ఉంది. ఇన్నాళ్ల నుంచి మనం చాలా ప్రశాంతంగా బతుకుతూనే ఉన్నాం. దానికి కారణం భారత సైన్యం. అందుకే ఏ విదేశీ క్రికెటర్, వ్యాఖ్యాత కూడా అభద్రతాభావంతో లేదని భావిస్తున్నా" అని గావస్కర్ వెల్లడించారు.



# టెస్టులకు రోహిత్ వీడ్కోలు

## వన్డేల్లో కొనసాగుతానని ప్రకటన

**ముంబయి :** భారత క్రికెట్ అభిమానులందరూ ఐపీఎల్‌లో మునిగి ఉన్న సమయంలో స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ పెద్ద షాకిచ్చాడు. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ కోసం బీసీసీఐ సన్నాహాలు చేస్తున్న సమయంలో అతను సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. రోహిత్‌ను టెస్టు సారథిగా తప్పించడానికి సెలక్టర్లు నిర్ణయించారని, బీసీసీఐ నుంచి కూడా అందుకు ఆమోదం లభించిందని బుధవారం వార్తలు వచ్చాయి. దీని గురించి సామాజిక మాధ్యమాల్లో చర్చ జరుగుతుండగానే.. రోహిత్ ఇన్‌స్టాగ్రామ్‌లో తన టెస్టు రిటైర్మెంట్ గురించి ప్రకటించాడు. "నేను టెస్టుల నుంచి రిటైరవుతున్న విషయాన్ని మీ అందరితో పంచుకుంటున్నా. తెలుపు దుస్తుల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవం. ఇన్నేళ్లుగా నాకు ప్రేమను, మద్దతును అందించిన అందరికీ ధన్యవాదాలు. వన్డేల్లో భారత్‌కు ప్రాతినిధ్యం కొనసాగిస్తా" అని 38 ఏళ్ల రోహిత్ పేర్కొన్నాడు. 2013లో వెస్టిండీస్‌పై సుదీర్ఘ ఫార్మాట్లో అరంగేట్రం చేసిన రోహిత్.. 12 ఏళ్ల కెరీర్లో 67 టెస్టులాడి 40.57 సగటుతో 4301 పరుగులు సాధించాడు. అందులో 12 శతకాలు, 18 అర్ధశతకాలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 2019లో దక్షిణాఫ్రికా సాధించిన 212. రోహిత్ తన చివరి టెస్టును గత ఏడాది డిసెంబర్లో ఆస్ట్రేలియాపై ఆడాడు. గత ఏడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం రోహిత్ టీ20లకు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఇక అతను వన్డేల్లో మాత్రమే కొనసాగనున్నాడు. ఈ ఫార్మాట్లో కెప్టెన్‌గా అతను ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన సంగతి తెలిసిందే.

టెస్టులకు గుడ్‌బై చెప్పాలన్న రోహిత్ శర్మ నిర్ణయం అభిమానులకు కచ్చితంగా షాకే. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో మొదలయ్యే ప్రతిష్టాత్మక అయిదు టెస్టుల సిరీస్‌లో అతనే జట్టును నడిపిస్తాడని అంతా అనుకున్నారు. కొన్ని రోజుల ముందే ఈ పర్యటన కోసం బీసీసీఐ సన్నాహాలు మొదలుపెట్టింది. ఇండియా-ఎ జట్టు ఆడే ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లకు కూడా కలిపి 35 ఆటగాళ్లతో ఒక జాబితాను సిద్ధం చేసింది. అందులో రోహిత్ కూడా ఉన్నాడు. అతనే కెప్టెన్ అని కూడా వార్తలు వచ్చాయి. కానీ ఒక్క రోజులో మొత్తం మారిపోయింది. సెలక్షన్ కమిటీ రోహిత్ స్థానంలో కొత్త సారథిని తీసుకురావాలనుకుంది. గత రెండు సిరీస్‌ల్లో రోహిత్ బ్యాటర్‌గా, కెప్టెన్‌గా ఘోరంగా విఫలమవడం ఇందుకు ప్రధాన కారణం కావచ్చు. రోహిత్ సారథ్యంలో సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో టీమ్‌ఇండియా వైట్‌వాష్‌కు గురి కావడం అతడి కెప్టెన్సీ కెరీర్లో పెద్ద మచ్చగా మారింది. తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో ఘోర పరాభవాలు తప్పలేదు. రెండు సిరీస్‌ల్లోనూ రోహిత్ బ్యాటర్‌గా పేలవ ప్రదర్శన చేశాడు. చివరి 8 టెస్టుల్లో అతను ఒక్కసారే 50 దాటాడు. ఆస్ట్రేలియాలో చివరి టెస్టుకు రోహిత్ స్వచ్ఛందంగా తప్పుకొన్నపుడే అతను రిటైర్మెంట్ ప్రకటించబోతున్నాడని వార్తలు వచ్చాయి. కానీ ఆ ప్రచారాన్ని అతను ఖండించాడు. రోహిత్ ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు సన్నద్ధమవుతున్నట్లే కనిపించాడు. ఆ పర్యటనను తన, జట్టు ప్రదర్శనను బట్టే కెరీర్‌పై నిర్ణయం తీసుకుంటాడని భావించారు. కానీ ఇప్పుడు హఠాత్తుగా నిర్ణయం ప్రకటించేశాడు. ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా ఉండబోవని సెలక్టర్లు చెప్పడంతోనే రోహిత్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. రోహిత్ ఫామ్ బాగా లేకపోవడానికి తోడు తన వయసు కూడా 38 ఏళ్లు దాటిన నేపథ్యంలో కొత్త ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌ను నూతన సారథితో మొదలుపెడితే భవిష్యత్ దిశగా బాగుంటుందని సెలక్టర్లు భావించి ఉండొచ్చు. కెప్టెన్ కానపుడు కెరీర్ చరమాంకంలో కేవలం ఆటగాడిగా కఠినమైన ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లడం ఎందుకన్న ఉద్దేశంతో రోహిత్ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటన చేసి ఉండొచ్చు.



రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# సైన్యానికి బాసటగా చిత్రరంగం



### సింధూరం తిలకమే కాదు..
### అచంచల సంకల్పానికి చిహ్నం
### ఆలోచింప చేస్తున్న మోహన్ లాల్ పోస్ట్

**న్యూఢిల్లీ, మే 7 :** పహల్గాం ఉగ్ర దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటోంది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. పహల్గాం మృతులకు న్యాయం చేసేందుకే ఈ దాడులు చేసినట్లు- కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ తెలిపారు. దీంతో ప్రస్తుతం సోషల్ మీడియా అంతా భారత సైన్యానికి జేజేలు పలుకుతోంది. 'భారత్ మాతా కీ జై', 'మేమంతా మీ వెంటే' అంటూ నెటిజన్‌లు, ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు. తాజాగా మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మేం సిందూరాన్ని సంప్రదాయ తిలకంగా మాత్రమే కాదు.. మా అచంచలమైన సంకల్పానికి చిహ్నంగా కూడా ఉపయోగిస్తాం. మాకు ఎన్ని సవాళ్లు ఎదురైనా.. నిర్భయంగా, గతం కంటే బలంగా వస్తాం. భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, బీఎస్ఎఫ్‌లోని ప్రతీ ధైర్యవంతుడికి వందనాలు. మీ అందరి ధైర్యం మా గర్వాన్ని మరింత పెంచుతుంది. మిమ్మల్ని చూసి దేశమంతా గర్విస్తోంది. జైహింద్ అని మోహన్‌లాల్ పోస్ట్ పెట్టారు. 'ఆపరేషన్ సిందూర్'పై సినీ ప్రముఖులు కూడా స్పందించారు. ఉగ్రదాకి తగిన న్యాయం జరిగింది. మేరా భారత్ మహాన్. సైనికులకు సెల్యూట్ అని మహేశ్‌బాబు పేర్కొన్నారు. మన ఆర్మీ క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నా. జైహింద్ అంటూ ఎన్టీఆర్ పోస్ట్ చేశారు. రియల్ హీరోలకు సెల్యూట్. దేశం కోసం ఇండియన్ ఆర్మీ ఏం చేయగలదో 'ఆపరేషన్ సిందూర్'తో మ-రోసారి రుజువైంది. దేశం గర్వపడేలా చేశారు. జైహింద్ అని నటుడు మమ్ముట్టి తెలిపారు. సాయుధ దళాలు ఒక్క-టైన వేళ.. గర్వంగా ఉంది. భారత ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక సైనిక చర్యను అభినందిస్తున్నానని కమల్ హాసన్ అన్నారు. జైహింద్.. ఆపరేషన్ సిందూర్ అంటూ నాని పోస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడికి సమాధానం 'ఆపరేషన్ సిందూర్'. జైహింద్ అని కల్యాణ్‌రామ్ లన్నారు. ఇదీ భారతసైన్యం.. జైహింద్ అని శివ కార్తికేయన్ ప్రకటించారు. 'ఆపరేషన్ సిందూర్' కలిసి నిలబడదామంటూ ప్రముఖుల పోస్ట్‌లు.. పెట్టారు.




# ఓటిటిలోకి వచ్చేస్తున్న నితిన్ రాబిన్‌హుడ్

'సంక్రాంతి వస్తున్నాం', తదితర చిత్రాలను ఒకే సమయంలో అటు- ఛానల్‌లో, ఇటు- ఓటీటీలోకి తీసుకొచ్చింది 'జీ 5' సంస్థ. ఇప్పుడు 'రాబిన్‌హుడ్' విషయంలోనూ అదే ఫాలో అవుతోంది. మే 10న సాయంత్రం 6 గంటలకు ఈ సినిమా 'జీ తెలుగు' ఛానల్‌లో ప్రసారం కానుందని సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల తెరకెక్కించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాతోనే తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. మార్చి 28న థియేటర్లలో విడుదలైందీ సినిమా. రామ్ అలియాస్ రాబిన్‌హుడ్ (నితిన్) ఎవరూ లేని అనాథ. తనలాంటి తోటి పిల్లలతో కలిసి ఓ అనాథ శరణాలయంలో ఆశ్రయం పొందుతుంటాడు. ఆకలి, అవసరాల కోసం నేరాలబాట పట్టిన రామ్.. తెలివిగా చోరీలు చేస్తూ అనాథ శరణాలయాలకు అండగా నిలుస్తుంటాడు. పెరిగి పెద్దయ్యాక కూడా అదే బాటలో అతడి ప్రయాణం కొనసాగుతుంది. బంగారం చోరీ కేసులో ఐపీఎస్ అధికారి విక్టర్ వర్గీస్ (షైన్ టామ్ చాకో) చేతికి చిక్కినట్లే చిక్కి త్రుటిలో తప్పించుకున్న రామ్, కొన్నాళ్ల తర్వాత నేరాలబాట వీడి ఉద్యోగం చేయాలనుకుంటాడు. అలా జాన్ సున్నిపెంట అలియాస్ జాన్ స్నో (రాజేంద్రప్రసాద్) నడుపుతున్న ఇండియాస్ నంబర్‌వన్ సెక్యూరిటీ- ఏజెన్సీలో చేరి, ఆస్ట్రేలియా నుంచి వచ్చిన నీరా వాసుదేవ్ (శ్రీలీ) రక్షణ బాధ్యతల కోసం రంగంలోకి దిగుతాడు. అసలు ఎవరీ నీరా వాసుదేవ్? ఆమె ఇండియాకి ఎందుకొచ్చింది?అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం చేస్తున్న డ్రగ్ మాఫియా ఆమెని ఎందుకు టార్గెట్ చేసింది?అపాయంలోఉన్న నీరా వాసుదేవ్‌కి రామ్ రక్షణ కల్పించాడా లేదా?అనేది మిగతా కథ.

# తెలుగు వెబ్ సీరిస్‌లోకి కోవై సరళ



లేడీ కమెడియన్ ఎవరంటే ఠక్కున గుర్తొచ్చే పేరు కోవై సరళ. అప్పట్లో ఇండస్ట్రీలో ఆమె పేరు మారుమోగింది. ముఖ్యంగా బ్రహ్మానందం, కోవై సరళ జోడికి ప్రత్యేకంగా ఫ్యాన్స్ ఉండేవారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో అనేక చిత్రాల్లో నటించి, తనదైన బాషతో డిఫరెంట్ ఎక్స్ ప్రెషన్స్ తో దాదాపు రెండు దశాబ్దాల పాటు కోవై సరళ అందరినీ మెప్పించింది. అయితే కారణాలు ఏవైనా ఆమె కొంతకాలంగా తెలుగు సినిమాలకు దూరమైంది. తెలుగు అని కాదు తమిళంలో కూడా అడపాదడపా సినిమాలు చేస్తోంది. అలా తెలుగులో డబ్ అయ్యి వచ్చిన సినిమాలను మాత్రమే తెలుగు వాళ్ళు చూసి ఆనందించాల్సిన వస్తుంది. అయితే తాజా సమాచారం ప్రకారం ఇప్పుడు కోవై సరళ ఓ తెలుగు వెబ్ సీరిస్ లో ఎంట్రీ ఇస్తోందట. యంగ్ హీరోయిన్ రీతూ వర్మ, శివ కందుకూరి జంటగా నటిస్తున్న వెబ్ సీరీస్ 'దేవిక అండ్ డానీ'. ఈ సిరీస్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ ఇటీవలే రిలీజ్ అయింది. రీతూవర్మ కు ఇదే మొదటి వెబ్ సీరిస్. 'శ్రీకారం' మూవీ ఫేమ్ బి. కిశోర్ ఈ వెబ్ సీరిస్ ను డైరెక్ట్ చేశాడు. అతనితోపాటు- ఇందులో సూర్య వశిష్ఠ, సుబ్బరాజు, మౌనికా రెడ్డి, సోనియా సింగ్, చాగంటి సుధాకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. జయ్ క్రిష్ దీనికి మ్యూజిక్ అందించాడు. త్వరలో ఈ వెబ్ సీరిస్ జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కానుంది. మరి కోవై సరళ కామెడీ కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న తెలుగువారికి ఆమె ఈ వెబ్ సీరిస్ తో ఎలాంటి వినోదాన్ని పండిస్తుందో చూడాలి.

# బాలీవుడ్ స్టార్ హీరోను కలిసిన అల్లు అర్జున్

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్‌ను అల్లు అర్జున్ కలిశారు. ముంబయిలోని ఆమిర్ నివాసానికి వెళ్లిన బన్నీ ఆయనతో కలిసి కొంత సమయం ముచ్చటించారు. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతుండగా.. అభిమానులు వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందేమోనని ఆశిస్తున్నారు. ఇటీవల ఆమిర్‌ఖాన్ మాట్లాడుతూ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహా భారతం' గురించి తెలిపారు. అందులో అగ్ర కథానాయకులు భాగం కానున్నట్లు చెప్పారు. దీంతో బన్నీ ఈ ప్రాజెక్ట్‌లో నటించనున్నారా అనే సందేహాలు వస్తున్నాయి. ప్రస్తుతం అట్లీ సినిమాతో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఇందులో ఆయన ద్విపాత్రాభినయంలో నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇందులో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించనున్నారు. దీనికోసం అట్లీ, అల్లు అర్జున్ లాస్ ఏంజెలెస్‌లోని ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థను ఇటీవల సంప్రదించారు. ఇందులో హాలీవుడ్ తరహాలో విజువల్స్ ఉండనున్నట్లు తెలిపారు.






# వినోదాత్మక చిత్రం సింగిల్

## నవ్వించడం కష్టమన్న నటి కేతిక శర్మ

'ఆద్యంతం వినోదంతో నిండిన సినిమా 'సింగిల్'. ఈ చిత్రం చూస్తున్నంత సేపు మనస్ఫూర్తిగా నవ్వుకుంటూనే ఉంటారని అంటోంది నటి కేతిక శర్మ. శ్రీవిష్ణు జంటగా నటించిన ఈ చిత్రాన్ని కార్తీక్ రాజు తెరకెక్కించారు. ఇవానా మరో కథానాయిక. ఈ సినిమా ఈనెల 9న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో కేతికహైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది. గీతా ఆర్ట్స్ సంస్థలో చేయాలని ఎప్పటి నుంచో నా కోరిక. అది ఈ సినిమాతో నెరవేరినందుకు ఆనందంగా ఉంది. నేను ఈ కథ వింటున్నంత సేపు నవ్వుతూనే ఉన్నా. ఇది పూర్తిగా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్‌గా ముస్తాబైంది. దీంట్లో ప్రేమకథ కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో నేను పూర్వా అనే పాత్రలో కనిపిస్తాను. తను చాలా ప్రాక్టికల్‌గా ఉండే అమ్మాయి. ఈ కథలో ఎమోషన్ తన పాత్ర ద్వారానే వస్తుంది. ఈ పాత్ర అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుందని తెలిపింది. ఈ చిత్ర విషయంలో కామెడీ నాకు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే వినోదం పండించడం అంత తేలికేం కాదు. అందులోనూ కామెడీ టైమింగ్ విషయంలో శ్రీవిష్ణును మ్యాచ్ చేయడం మరింత కష్టం. ఈ సినిమాలో ఇంటర్వెల్ ఎపిసోడ్ చాలా సవాల్‌గా అనిపించింది. ప్రేక్షకులు పొట్టచెక్కలయ్యేలా నవ్వుకునేలా కార్తీక్ ఈ చిత్రాన్ని రూపొందించారని చెప్పింది. రాబిన్‌హుడ్'లోని నా ప్రత్యేక గీతం 'అదిదా సర్‌ప్రైజ్'కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడం సంతోషాన్నిచ్చింది. అయితే ఆ పాట విషయంలో తలెత్తిన వివాదం నుంచి ఓ విషయం నేర్చుకున్నా. భవిష్యత్తుల్లో అలాంటి పాటలు చేసేటప్పుడు స్టెప్పుల విషయంలో మరింత జాగ్రత్త వహించాలని నిర్ణయించుకున్నా. ప్రస్తుతం నేను హిందీలో ఓ సినిమా చేస్తున్నా. అలాగే తమిళ తెలుగు ద్విభాషా చిత్రం ఒకటి చేస్తున్నా. మరికొన్ని సినిమాలు లైనప్‌లో ఉన్నాయి. వాటి వివరాల్ని త్వరలో ప్రకటిస్తారని కేతిక తెలిపింది.



# రాణి అహల్యాబాయి జీవిత చరిత్ర

## చిత్రం తీస్తామని వెల్లడించిన మహా సిఎం

ఇప్పటికే ఎంతోమంది ధీరుల బయోపిక్‌లు ప్రేక్షకులను ఆకట్టుకున్న క్రమంలో తాజాగా మరాఠ రాణి అహల్యా బాయి హోల్కర్ జీవితం తెరకెక్కనుంది. ఆమె జీవితగాథ ఆధారంగా సినిమా తీయనున్నట్లు- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. రాణి అహల్యా బాయి హోల్కర్ 300వ జయంతిని పురస్కరించుకొని మహారాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రమంతటా కొన్ని ప్రాజెక్ట్‌లకు శ్రీకారం చుట్టింది. అలానే ఆమె జీవితం ఎంతోమందికి స్ఫూర్తి అని అందుకే సినిమాగా ప్రేక్షకులకు అందించాలని నిర్ణయించుకున్నట్లు- సీఎం తెలిపారు. దీనిపై ఇప్పటికే చర్చలు ప్రారంభమైనట్లు వెల్లడించారు. మరాఠీతో పాటు ఇతర భాషల్లోనూ ఈ సినిమా విడుదల చేయనున్నట్లు చెప్పారు. దూరదర్శన్, ఇతర ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలోనూ రాణి అహల్యా బాయి హోల్కర్ బయోపిక్ అందుబాటులో ఉండేలా చూస్తామని అన్నారు. ఇటీవలే మరాఠా యోధుడు శంభాజీ మహారాజ్ వీరగాథ 'ఛావా' ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా విడుదలైన అన్ని భాషల్లోనూ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకున్న 'ఛావా' ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటు-లో ఉంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com